RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

సంపుటి : 18
సంచిక : 166
Vol : 18
Issue : 166

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, శుక్రవారం 28 ఆగస్టు 2026
Warangal, Friday 28 August 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts

WANTED
పీపుల్స్‌డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859

www.epaper.
peoplesdairynews.com
www.peoplesdairynews.com

## ఈవీ రంగంలో 2030 నాటికి
# 5 కోట్ల ఉద్యోగాలు

### కేంద్ర మంత్రి గడ్కారీ వెల్లడి



పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ : భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) రంగం వేగంగా విస్తరిస్తోంది. ఇదే జోరు కొనసాగిస్తూ 2030 నాటికి దేశంలో ఈవీ మార్కెట్ విలువ రూ.20 లక్షల కోట్లకు చేరుకునే అవకాశముందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. ఈ రంగం ద్వారా అదే సమయానికి(2030) 5 కోట్ల ఉద్యోగ అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. బుధవారం సీఐఐ-ఐటీసీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ నిర్వహించిన సదస్సులో గడ్కరీ ఈ విషయాలను వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో సుమారు 57 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలు రిజిస్టరై ఉన్నాయని తెలిపారు. మొత్తం వాహన మార్కెట్‌లో ఈవీల వాటా 7 శాతంగా ఉందని చెప్పారు.

**ఎలక్ట్రిక్ బస్సులకు భారీ డిమాండ్**

దేశంలో ప్రతి సంవత్సరం సుమారు లక్ష ఎలక్ట్రిక్ బస్సులకు డిమాండ్ ఉందని గడ్కరీ తెలిపారు. అయితే ప్రస్తుతం దేశీయ తయారీదారులు ఏడాదికి 50 వేల నుంచి 60 వేల వరకు మాత్రమే ఎలక్ట్రిక్ బస్సులను ఉత్పత్తి చేయగలుగుతున్నారని చెప్పారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే ఐదేళ్లలో భారత ఆటోమొబైల్ పరిశ్రమను ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ లక్ష్యం కష్టమైనదే అయినప్పటికీ సాధ్యమేనని ఆయన పేర్కొన్నారు. తాను రవాణా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో భారత ఆటోమొబైల్ పరిశ్రమ విలువ రూ.14 లక్షల కోట్లుగా ఉండగా, ప్రస్తుతం అది సుమారు రూ.22 లక్షల కోట్లకు పెరిగిందని తెలిపారు. అమెరికా ఆటోమొబైల్ పరిశ్రమ విలువ రూ.78 లక్షల కోట్లు, చైనా విలువ రూ.47 లక్షల కోట్లుగా ఉందని గడ్కరీ వివరించారు.

భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగడం ద్వారా ఆటోమొబైల్ రంగంతో పాటు బ్యాటరీ తయారీ, ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు, సర్వీసింగ్, ఫైనాన్స్ వంటి అనుబంధ రంగాల్లోనూ భారీగా అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందని వివరించారు.

## నేపాల్ వరదల్లో 288 మంది
# భారతీయులు గల్లంతు..

### కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన



పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ : నేపాల్‌లో బుధవారం సంభవించిన మెరుపు వరదల్లో పెద్ద సంఖ్యలో విదేశీ పర్యాటకులు గల్లంతయ్యారు. ఈ ఘటనలో 270 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 826 మంది గల్లంతయ్యారు. అయితే, బాధితుల్లో భారతీయులే ఎక్కువ మంది. నేపాల్ విపత్తులో గల్లంతైన భారతీయుల సంఖ్యపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. 288 మంది భారతీయుల ఆచూకీ లేకుండా పోయినట్టు పేర్కొంది. త్రిశూలీ పవర్ ప్రాజెక్ట్-1కు చెందిన 73 భారతీయులతో పాటు 86 మంది తమిళనాడు యాత్రికులు, పశ్చిమ బెంగాల్‌కు చెందిన 32, కేరళకు చెందిన 33, మిగతా రాష్ట్రాలకు చెందిన 61 మంది ఉన్నట్టు తెలిపింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియా సమావేశంలో వెల్లడించారు. (మిగతా 2వ పేజీలో...)

# ఆటో డ్రైవర్లకు గుడ్‌న్యూస్..

### అమల్లోకి కొత్త పథకం!

- రూ.200 కోట్ల బడ్జెట్ కేటాయింపు
- ప్రతి ఒక్కరికి రూ.1.50లక్షల వరకు సబ్సిడీ!
- తొలుత హైదరాబాద్ పరిధిలో అమలు



పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : రాష్ట్రాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు తెలంగాణ సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ వాహనాలను ఈవీలుగా మార్చేస్తుంది. ఇప్పటికే రవాణాల వ్యవస్థలో ఈవీ బస్సులను ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. డీజిల్ బస్సులు వినియోగాన్ని తగ్గించింది. అలాగే హైదరాబాద్ పరిధిలో వాయు కాలుష్యాన్ని తగ్గించడం, ఆటో డ్రైవర్లపై ఇంధన భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్-2026కు అనే కొత్త పథాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. తాజాగా ఈ పథకాన్ని అమలు చేసేందుకు జీవో కూడా జారీ చేసింది. ఈ పథకం కింద హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలో తిరిగే పెట్రోల్, డీజిల్ (మిగతా 2లో...)

# వినాయక భక్తులకు శుభవార్త

### హైదరాబాద్‌లో లక్ష మట్టి విగ్రహాలు ఉచితం..



పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : హైదరాబాద్‌లో వినాయక చవితి నవరాత్రోత్సవాలను పర్యావరణహితంగా జరిపేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కీలక నిర్ణయం తీసుకుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాల వినియోగాన్ని తగ్గించి.. నీటి వనరులను కాలుష్యం నుంచి రక్షించే లక్ష్యంతో ఈ ఏడాది లక్ష మట్టి వినాయక విగ్రహాలను అందుబాటులోకి తీసుకురానుంది. 'ఎకో గణేశ్.. గ్రీన్ గణేశ్.. క్లే గణేశ్' కార్యక్రమంలో భాగంగా వీటిని నగరంలోని లక్షమంది భక్తులకు పంపిణీ (మిగతా 2లో...)



# దారుణం..

- కొడుకు ముందే తల్లిపై లైంగిక దాడి
- మహిళను తీవ్రంగా గాయపరిచిన దుండగులు

పీపుల్స్‌డైరీ-మక్తల్ : నిద్రిస్తున్న మహిళపై కన్న కొడుకు ముందే లైంగిక దాడి చేసి సదరు మహిళ ప్రైవేట్ పార్ట్స్‌ను కోసి వేసిన ఘటన నారాయణపేట జిల్లా మక్తలపట్టణంలో గురువారం తెల్లవారు జామున చోటు చేసు కుంది. వివరాల లోకి వెళితే..మక్తల్ పట్టణానికి చెందిన ఓ మహిళ గత కొన్ని సంవత్సర నుండి ఒంటరిగా తన 12 ఏండ్ల కొడుకుతో జీవనం కొనసాగిస్తున్నది. జీవనోపాధికోసం సదరు మహిళ (మిగతా 2లో...)

# వైద్య సేవల్లో సంపూర్ణత ఏది?



AI Image

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : తెలంగాణలో వైద్య సదుపాయాలు శరవేగంగా విస్తరిస్తున్నా.. అందుకు అనుగుణంగా నర్సింగ్ సిబ్బంది సంఖ్య పెరగడం లేదని తాజా గణాంకాలు చెబుతున్నాయి. గత రెండున్నరేళ్లలో 10 వేల మందికి పైగా నర్సింగ్ సిబ్బందిని విధుల్లోకి తీసుకున్నప్పటికీ.. రాష్ట్రంలో నర్సుల కొరత మాత్రం తీవ్రంగా వేధిస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో ప్రతి 1000 మంది జనాభాకు కేవలం 1.58 మంది నర్సులు మాత్రమే ఉన్నట్లు తేలడం తీవ్ర ఆందోళన కరంగా మారింది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సూచించిన 3 మంది నర్సుల ప్రమాణంతో పోలిస్తే 47 శాతం తక్కువ అని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

(మిగతా 2లో...)

- తెలంగాణలో వెంటాడుతున్న నర్సుల కొరత
- డబ్ల్యుహెచ్ఓ ప్రమాణాల కంటే 47 శాతం తక్కువ
- గణనీయంగా పెరుగుతున్న రోగులు...
- అందుకు అనుగుణంగా నర్సులు లేరు
- దక్షిణాదిలో తెలంగాణ వెనకబాటు
- కేంద్ర ప్రభుత్వ లెక్కలు ఇవే...

## కాంట్రాక్టర్‌తో తాగునీటి
# అమ్మకాలు

- గ్రేటర్ వరంగల్ బల్దియా దేశాయిపేట ఫిల్టర్ బెడ్ కేంద్రంగా దందా
- రోడ్డు కాంట్రాక్టర్లకు నీటిని సరఫరా చేస్తున్న ఇంజనీరింగ్ విభాగం
- అపార్టుమెంట్లకు, శుభకార్యాలకు ట్యాంకర్‌లతో నీటి సరఫరా
- అవగాహన లేని వర్క్ ఇన్‌స్పెక్టర్‌ల పర్యవేక్షణ
- పదవ తరగతి వ్యక్తులు వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా పెత్తనం
- క్వాలిటీ,క్వాంటిటీ తెలియని వారి చేతుల్లో కంట్రోలింగ్
- సంతకాలకే పరిమితమైన ఇంజనీరింగ్ విభాగం అధికారులు
- గ్రేటర్ కమిషనర్ దృష్టి సారించాలని విన్నపం

2లో



# మైన్స్ ఏడీ ఇంట్లో ఏసీబీ మెరుపు దాడి

- ఏసీబీ సోదాల్లో పెద్ద మొత్తంలో నగదు
- బ్యాంకులో 60 లక్షల నగదు... 40 తులాల బంగారం?

2లో

## ప్రభుత్వ విద్య, వైద్యరంగాల బలోపేతానికి
# పెద్దపీట

రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2వ పేజీలో..

# కాంట్రాక్టర్‌తో తాగునీటి అమ్మకాలు

- గ్రేటర్ వరంగల్ బల్దియా దేశాయిపేట ఫిల్టర్ బెడ్ కేంద్రంగా దందా
- రోడ్డు కాంట్రాక్టర్లకు నీటిని సరఫరా చేస్తున్న ఇంజనీరింగ్ విభాగం
- అపార్టుమెంట్లకు, శుభకార్యాలకు ట్యాంకర్‌లతో నీటి సరఫరా
- అవగాహన లేని వర్క్ ఇన్‌స్పెక్టర్‌ల పర్యవేక్షణ
- పదవ తరగతి వ్యక్తులు వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా పెత్తనం
- క్వాలిటీ,క్వాంటిటీ తెలియని వారి చేతుల్లో కంట్రోలింగ్
- సంతకాలకే పరిమితమైన ఇంజనీరింగ్ విభాగం అధికారులు
- గ్రేటర్ కమిషనర్ దృష్టి సారించాలని విన్నపం







**పీపుల్స్‌డైరీ, ప్రతినిధి వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నీటి సరఫరా ఫిల్టర్ బెడ్‌లోని నీటిని ట్యాంకర్ లతో అమ్మకాలు జరుపుతున్నట్టు తెలిసింది. దేశాయిపేట ప్రాంతంలోని ఫిల్టర్ బెడ్‌లో విచ్చలవిడిగా కాంట్రాక్టర్‌లకు మద్దతుగా అధికారులు వంతపాడుతున్నారు. కాంట్రాక్టర్లు ఇచ్చే నగదుకు ఆశపడి అధికారులు వారికి వత్తాసు పలుకుతున్నట్టు తెలిసింది. పెద్దపెద్ద అపార్ట్మెంట్‌లకు , రోడ్డు కాంట్రాక్టర్లకు దేశాయిపేట ఫిల్టర్ బెడ్ నుండి నీటిని సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక ఇక్కడ విధులు నిర్వర్తించాల్సిన వర్క్ ఇన్‌స్పెక్టర్లు అవగాహన లేని పనికి జీతాలు తీసుకుంటూ కాంట్రాక్టర్లకు వెన్నంటి ఉంటూ వారిని మచ్చిక చేసుకుంటూ రోడ్డు నిర్మాణాల్లో నాణ్యత లేకున్నప్పటికీ బిల్లులు కేటాయిస్తూ వెన్ను దన్నుగా నిలుస్తున్నారు. కనీసం అవగాహన లేని వారిని వర్క్ ఇన్స్పెక్టర్లుగా బాధ్యతలు అప్పగించి బల్దియా ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇక ఇంజనీరింగ్ విభాగంలో అధికారులకు విషయం తెలిసినప్పటికీ వారు సైతం పట్టించుకోకుండా ఉండటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ స్పందించి ఇలాంటి వాటిపై దృష్టి సారించి సిబ్బందిపై.... ప్రోత్సహిస్తున్న ఇంజనీరింగ్ విభాగ అధికారులపై చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

## ఫిల్టర్ బెడ్‌లో తాత్కాలిక ఉద్యోగుల పెత్తనం

వివరాలు : వచ్చే వచ్చే సంచికలో

# వైద్య సేవల్లో సంపూర్ణత ఏది?

(మొదటి పేజీ తరువాయి)

ఈ వివరాలను కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా.. రాజ్యసభలో వెల్లడించారు. ఈ వివరాల ప్రకారం.. తెలంగాణలో ప్రస్తుతం 60,919 మంది రిజిస్టర్డ్ నర్సులు, రిజిస్టర్డ్ మిడ్‌వైవ్స్ ఉన్నారని తెలుస్తోంది. తెలంగాణలో 2026 అంచనా జనాభా దాదాపు 3.9 కోట్లుగా ఉండటంతో ఈ సంఖ్య ప్రతి 1,000 మందికి 1.58 నర్సులకు సమానంగా ఉంది. ఇక.. దేశవ్యాప్తంగా సగటున ప్రతి 1,000 మంది జనాభాకు 2.45 మంది నర్సులు ఉండగా.. తెలంగాణ అంతకంటే కూడా వెనుకబడి ఉండటం గమనార్హం.

డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాలను అందుకోవాలంటే తెలంగాణ రాష్ట్ర ప్రస్తుత జనాభా ప్రకారం సుమారు 1.16 లక్షల మంది నర్సులు, మిడ్‌వైవ్స్ కావాల్సి ఉంటుంది. అంటే దాదాపు 55 వేల మంది సిబ్బంది కొరత ఉన్నట్లు గణాంకాల ఆధారంగా అర్థమవుతోంది. ఇక నర్సుల జనాభా నిష్పత్తిలో దక్షిణాది రాష్ట్రాలు తెలంగాణ కంటే ముందుండటం గమనార్హం. కేరళ 10.47, కర్ణాటక 7.69, ఆంధ్రప్రదేశ్ 5.72, తమిళనాడు 5.09 నర్సులు ప్రతి 1,000 మంది జనాభాకు కలిగి ఉన్నాయి. తెలంగాణలో మాత్రం ఈ నిష్పత్తి 1.58గా ఉండటం తీవ్ర ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

ఇక దేశంలోని పెద్ద రాష్ట్రాలైన గుజరాత్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్ కంటే తెలంగాణ రాష్ట్రం.. నర్సుల సంఖ్యలో కాస్త మెరుగ్గా ఉన్నప్పటికీ.. ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే గణనీయంగా వెనుకబడి ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నర్సుల కొరత మరింత తీవ్రంగా ఉందని తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. నిబంధనల ప్రకారం 100 పడకల ఆస్పత్రికి సుమారు 45 మంది నర్సులు అవసరం కాగా.. తెలంగాణ ఏర్పడక ముందు ప్రభుత్వ ఆస్పత్రుల్లో దాదాపు 17 వేల పడకలకు సుమారు 13 వేల మంది నర్సులు ఉండగా.. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకల సంఖ్య 28 వేలకు పైగా పెరిగింది. అయితే అందుకు అనుగుణంగా నర్సుల నియామకాలు జరగలేదని తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ ప్రతినిధులు చెబుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మరో 6 వేల నుంచి 7 వేల మంది నర్సుల అవసరం ఉందని తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. కొత్త వైద్య కళాశాలలు, జిల్లా ఆస్పత్రులు, ఐసీయూలు, దయాలసిస్ కేంద్రాలు, సూపర్ స్పెషాలిటీ విభాగాలు పెరుగుతున్న నేపథ్యంలో నర్సింగ్ సిబ్బంది నియామకాలు కూడా అదే స్థాయిలో పెరగాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



# నేపాల్ వరదల్లో 288 మంది భారతీయులు గల్లంతు..

(మొదటి పేజీ తరువాయి)

"త్రిశూలీ-1 విద్యుత్ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న 73 మంది మొదటి బృందంలో ఉన్నారు. ఆ తర్వాత సమ్రాట్, ఫ్లై ఎవరెస్ట్ ట్రావెల్స్ ద్వారా కైలాస మానసరోవర్ యాత్రకు వెళ్లిన తమిళనాడుకు చెందిన 86 మందితో కూడిన రెండు వేర్వేరు బృందాలు ఉన్నాయి. రసువా జిల్లాలోని తిమురేలో సమ్రాట్ ట్రావెల్స్ సహాయంతో వెళ్లిన పశ్చిమ బెంగాల్‌కు చెందిన 32 మంది భారతీయ పౌరుల బృందం కూడా ఉంది... "అలాగే వివిధ రాష్ట్రాలకు చెందిన 61 మంది భారతీయుల బృందం.. కేరళకు చెందిన 33 మందితో కూడిన మరో బృందం ఉంది. గల్లంతైన 288 మందిలో ఈ ఐదు ముఖ్యమైన బృందాలు ఉన్నాయి" అని ఆయన తెలిపారు. అలాగే, మానసరోవర్ యాత్రకు వెళ్లిన మరో 21 మంది తమిళనాడు యాత్రికులు సురక్షితంగా బయటపడినట్టు పేర్కొన్నారు. అలాగే, బాధితుల సహాయార్థం టోల్ ఫ్రీ నెంబర్లను కూడా ఏర్పాటుచేసినట్టు రణధీర్ జైస్వాల్ తెలిపారు. నేపాల్‌కు పెద్ద ఎత్తున సహాయ సామగ్రి పంపుతున్నట్టు ఆయన పేర్కొన్నారు.

పదుల సంఖ్యలో వంతెనలు ధ్వంసమయ్యాయని, దాదాపు 40 కిలోమీటర్ల (25 మైళ్లు) రహదారులు దెబ్బతిన్నాయని నేపాల్ అధికారులు తెలిపారు. వంతెనలు, రహదారులు కొట్టుకుపోవడం గాలింపు, సహాయక చర్యలను మరింత సంక్లిష్టం చేస్తోంది. గురువారం ఉదయం హెలికాప్టర్ ఆపరేషన్ల ద్వారా వరద ప్రభావిత ప్రాంతాల నుంచి 100 మందికి పైగా ప్రజలను నేపాల్ ఆర్మీ రక్షించిందని సైనిక ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ రాజా రామ్ బస్నేత్ తెలిపారు.

కనీసం ఎనిమిది మంది విదేశీ పౌరులను విమానంలో దేశ రాజధాని కాఠ్మాండూకు తరలించినట్లు ఆయన చెప్పారు. త్రిశూలీ జలవిద్యుత్ ప్రాజెక్ట్ వద్ద చిక్కుకున్న కార్మికులను కూడా ఆర్మీ బృందాలు సురక్షితంగా బయటకు తరలించాయని ఆయన పేర్కొన్నారు.

# ప్రభుత్వ విద్య, వైద్యరంగాల బలోపేతానికి పెద్దపీట

- స్కిల్డ్, టెక్నికల్ ఎడ్యుకేషన్‌తో మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- పేదలపై ఆర్థిక భారం పడొద్దన్నదే మా లక్ష్యం
- ఇప్పటికే ఆడబిడ్డలకు రూ. 63వేల కోట్ల వడ్డీ లేని రుణాలిచ్చాం
- నాలుగో విడత కూడా ఇందిరమ్మ ఇళ్లిస్తాం
- భవిష్యత్తులోనూ రైతులు, మహిళల సంక్షేమానికి ఎంతో చేస్తామన్న రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- గోపాలపురంలో రూ.30 లక్షలతో నిర్మించే పాఠశాల భవన పనులకు శంకుస్థాపన
- ఆడబిడ్డలందరికీ ముందస్తుగా రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన శీనన్న

**ఖమ్మం, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) :**

ప్రభుత్వ విద్య, వైద్య రంగాల బలోపేతానికి, మెరుగైన సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం ఎర్రగడ్డ గ్రామపంచాయతీ పరిధిలోని గోపాలపురం గ్రామంలో రూ.30 లక్షల నిధులతో చేపట్టిన ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ దివాకర. టీఎస్ తో కలిసి ప్రసంగించారు.

**గత పాలకులు విస్మరించారు..**
**మేం చిత్తశుద్ధితో చేస్తున్నాం..**

గతంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని.. ప్రజల దీవెనలతో వచ్చిన ఈ ప్రజా ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గడిచిన రెండున్నర ఏళ్లలో ఎంతో చిత్తశుద్ధితో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళుతున్నామన్నారు. పాలేరు నియోజకవర్గమే కాదు, రాష్ట్రవ్యాప్తంగా మన ప్రభుత్వం గత పాలకుల కంటే విద్య, వైద్య రంగాలకు రెండు మూడు రెట్లు అధికంగా నిధులు వెచ్చించిందని చెప్పారు. పేదవాడి పై ఆర్థిక భారం పడకుండా నూతనంగా ప్రభుత్వ హాస్పిటళ్లు నిర్మిస్తూ, వైద్యులు, వైద్య సిబ్బందిని నియమిస్తూ అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

**స్కిల్ యూనివర్సిటీ తో మెరుగైన ఉద్యోగ అవకాశాలు**

సాంకేతిక విద్య బలోపేతానికి స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ ని ఏర్పాటు చేసి దాని ద్వారా టెక్నికల్ ఎడ్యుకేషన్ అంశాలపై శిక్షణ కార్యక్రమాలతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందిస్తామని ప్రకటించారు.

**-ఆడబిడ్డలకు 63 వేల కోట్ల వడ్డీ లేని రుణాలిచ్చాం..**

వడ్డీ లేని రుణాలిచ్చి..క్షేత్ర స్థాయిలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గడిచిన రెండున్నరేళ్లలో రూ. 63 వేలకోట్ల రుణాలు ఇప్పించినట్లు వివరించారు. అలాగే..రైతుల విషయంలో ఈ ప్రభుత్వం తొలినుంచీ రైతు పక్షపాత ప్రభుత్వమని ప్రకటించారు.

**-నాలుగో విడత కూడా ఇందిరమ్మ ఇళ్లిస్తాం..**
**-అర్హులంతా పింఛన్లకు అప్లై చేసుకోండి**

ఇచ్చిన మాట ప్రకారం సన్నబియ్యం ఇచ్చామని, రేషన్ కార్డులు మంజూరు చేశామని, ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడత కూడా ఇచ్చామని, పేదవాడికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో మూడో, నాలుగో విడత కూడా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు. అర్హులంతా 31వ తేదీ నాటికి పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని, త్వరలోనే కొత్త పింఛన్లు ఇవ్వబోతున్నామని అన్నారు. పేదవారికి మౌలికంగా ఏమవసరమో వాటన్నింటినీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో వడివడిగా వారి గుమ్మం ముందుకే చేరవేస్తున్నామని అని చెప్పేందుకు సంతోషిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా.. కార్యక్రమానికి హాజరైన మహిళలకు, పాలేరు నియోజకవర్గ, రాష్ట్ర ఆడబిడ్డలందరికీ ముందస్తుగా రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.









# వినాయక భక్తులకు శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

చేయనున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని సర్కిల్, జోనల్ కార్యాలయాల ద్వారా సెప్టెంబర్ రెండో వారంలో మట్టి విగ్రహాలను అందుబా టులోకి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. భక్తులతో పాటు కాలనీ సంక్షేమ సంఘాలు, గణేష్ మండపాల నిర్వాహకులు కూడా వీటిని పొందేందుకు అవకాశం కల్పించనున్నారు. మొత్తం లక్ష విగ్రహాలను మూడు సైజుల్లో సిద్ధం చేయనున్నారు. ఇందులో

70 వేల విగ్రహాలను 8 అంగుళాల ఎత్తులో.. 20 వేల విగ్రహాలను ఒక అడుగు ఎత్తులో, 10 వేల విగ్రహాలను 1.5 అడుగుల ఎత్తులో తయారు చేయనున్నారు.

అయితే ఈ మట్టి విగ్రహాలను కొనుగోలు చేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు గరిష్ఠ ధరలను కూడా నిర్ణయించారు. 8 అంగుళాల విగ్రహానికి రూ.34.30.. ఒక అడుగు విగ్రహానికి రూ.142.. 1.5 అడుగుల విగ్రహానికి రూ.220 వరకు చెల్లించి తయారు చేయించనున్నారు. మట్టి విగ్రహాల తయారీ, సరఫరా కోసం టెండర్ల ద్వారా ఏజెన్సీలను ఎంపిక చేయనున్నారు. ప్రతి సైజు విగ్రహాల తయారీలోనూ అత్యల్ప ధరను కోట్ చేసిన సంస్థకు అవకాశం కల్పించనున్నారు. ఎంపికైన ఏజెన్సీలు తమ సొంత ఖర్చుతో జీహెచ్ఎంసీ నిర్దేశించిన ప్రాంతాలకు విగ్రహాలను తరలించాల్సి ఉంటుంది. గణేష్ ఉత్సవాలకు కనీసం వారం రోజుల ముందే విగ్రహాలను అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది.

# దారుణం..

(మొదటి పేజీ తరువాయి)

పట్టణంలో నీ ప్రధాన కూడలి తోపాటు, బస్టాండ్ లో బిక్షాటన చేస్తూ జీవిస్తున్నది. గత 10సంవత్సరాలకు పైగా రాత్రి పూట మక్తల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం వద్ద తలదాచుకుంటున్నది. ఈ క్రమంలో గురువారం తెల్లవారు జామున ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మక్తల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం వద్ద నిద్రిస్తున్న తల్లి కొడుకుల దగ్గరకు వెళ్లి, తల్లిపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడి చేయడానికి ప్రయత్నించిన క్రమంలో తల్లి కేకలు వేయడంతో నిద్రస్తున్న మహిళా కుమారుడు లేచాడు. తల్లిపై దాడికి దిగిన ఇద్దరు వ్యక్తులను అడ్డుకొనే ప్రయత్నం చేసినా మద్యం మత్తులో ఉన్న ఆ ఇద్దరు వ్యక్తులు పిల్లవాడిపై దాడికి దిగడంతో భయంతో పరుగులు తీశాడు. ఇద్దరు వ్యక్తులు మహిళపై విచక్షణ రహితంగా లైంగిక దాడికి పాల్పడి అనంతరం మహిళ ప్రైవేట్ పాట్స్ ను కోసి వేసి వెళ్లిపోయారు. మహిళ రక్తపు మడుగులో పడిపోయినా దృశ్యాన్ని తెల్లవారు జామున మక్తల్ మినీస్టేడియం గ్రౌండ్‌లో వాకింగ్ కు వచ్చిన పట్టణ ప్రజలు గమనించి పోలీసులకు సమాచారమందించారు. మక్తల్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని బాధితురాలిని దవాఖానకు తరలించారు. కేసునమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

# ఆటో డ్రైవర్లకు గుడ్‌న్యూస్..

(మొదటి పేజీ తరువాయి)

ఆటోలను దశలవారీగా ఎలక్ట్రిక్ (ఈవీ) వాహనాలుగా మార్చనుంది. అయితే ప్రస్తుతం తొలి విడతలో భాగంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్‌గా మార్చేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రభుత్వం రూ.200 కోట్ల బడ్జెట్‌ను కూడా కేటాయిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో త్వరలోనే ఈ ప్రక్రియ మొదటు కాబోతుంది. ఒక వేళ ఈ ఆటోలు అన్ని ఈవీలుగా మారుస్తే ఆటో డ్రైవర్లకు భారీ లాభం చేకూరనుంది.

అయితే ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం రెండు ఆప్షన్స్‌ను ఇస్తోంది. ఒకటి పాత ఆటోను ఈవీగా మార్చడం అంటే ఉన్న పాత ఆటో ఛాసిస్‌ను అలాగే ఉంచి, పెట్రోల్/డీజిల్ ఇంజిన్ స్థానంలో ఏఐఎస్-123 ప్రమాణాలు కలిగిన ఎలక్ట్రిక్ కిట్‌ను అమర్చుతారు. ఇందుకోసం ఫిక్స్‌డ్ బ్యాటరీ లేదా బ్యాటరీ మార్చుకునే అవకాశం ఉంటుంది. ఇక రెండో ఆప్షన్ ఏంటంటే.. మీ దగ్గర ఉన్న పాత ఆటో స్థానంలో కొత్త ఈవీ కొనుగోలు చేయడం. అంటే ఇప్పుడు డ్రైవర్లు వాడుతున్న తమ వాహనాన్ని స్క్రాప్ చేసి.. కొత్త ఈవీని కొనుగొలు చేయాలి. అయితే కొత్త ఆటోలు కొనేవారికి రూ.1.5లక్షల వరకు సబ్సిడీ కూడా ఇవ్వనున్నారు. ఎలక్ట్రిక్ ఆటోలకు ఈవీల మాదిరి పెట్రోల్, డీజిల్ వాడాల్సిన పని ఉండదు కాబట్టి.. వాటికి పెట్టే డబ్బులు డ్రైవర్లకు మిగులుతాయి. అంతేకాదు నగరంలో కాలుష్యం కూడా చాలా వరకు తగ్గుతుంది. అలాగే సౌండ్ పొల్యూషన్ కూడా తగ్గుతుంది.

# మైన్స్ ఏడీ ఇంట్లో ఏసీబీ మెరుపు దాడి

## ఏసీబీ సోదాల్లో పెద్ద మొత్తంలో నగదు

## బ్యాంకులో 60 లక్షల నగదు... 40 తులాల బంగారం





**చిట్యాల, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గనులు భూగర్భ శాఖ కార్యాలయం లంచాలకు అడ్డాగా మారిందనే అనుమానాల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు గురువారం రంగంలోకి దిగారు. జిల్లా సహాయ సంచాలకులు బొజ్జ జయరాజ్ పై వచ్చిన అవినీతి ఆరోపణలతో గురువారం ఉదయం నుండి 12 ప్రాంతాల్లో ఏకకాలంలో మెరుపు దాడులు చేపట్టారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్ బోడుప్పల్ లోని ఆయన సొంత నివాసంతో పాటు భూపాలపల్లి కలెక్టరేట్ లోని మైన్స్ ఏడీ కార్యాలయంలో తనిఖీలు ముమ్మరంగా కొనసాగాయి. సూర్యాపేట తాండూరు తదితర ప్రాంతాల్లోని బంధువులు సన్నిహితుల ఇళ్లలోనూ సోదాలు చేపట్టారు. భూపాలపల్లితో పాటు ములుగు జిల్లా ఇంచార్జిగా ఉన్న జయరాజ్ ఇసుక అక్రమ రవాణాదారులతో కుమ్మక్కై భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని ఏసీబీకి పక్కా సమాచారం ఉంది. దీంతో ఆయన కార్యాలయంలోని ఫైళ్లు రికార్డులు అనుమతి పత్రాలు ఇసుక రవాణాకు సంబంధించిన దస్త్రాలను ఏసీబీ ఇన్స్పెక్టర్ బృందం జల్లెడ పడుతోంది. కార్యాలయంలోని ఓ ఉద్యోగిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ సోదాల్లో లక్షన్నర నగదు 40 తులాల బంగారు ఆభరణాలు బోడుప్పల్ లో జి ప్లస్ వన్ బిల్డింగు బ్యాంకులో 60 లక్షల నగదు రెండు కార్లు రెండు బైకులు జనగామలో 5 ఎకరాల వ్యవసాయ భూమి పెద్ద మొత్తంలో నగదు బంగారం భూముల రిజిస్ట్రేషన్ పత్రాలు బినామీ ఆస్తుల వివరాలు లభించినట్లు తెలుస్తోంది. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న కొద్ది రోజులకే ఆయనపై ఏసీబీ దాడులు జరగడం జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. సోదాలు పూర్తయిన తర్వాత అక్రమాస్తుల వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.

# పసరలోజోరుగా రక్షబంధనాల కొనుగోలు.



**గోవిందరావుపేట, ఆగస్టు 27( పీపుల్స్ డైరీ )** మండల పరిధి పసరలో గురువారం భారీ ఎత్తున రాఖీల షాపులు ఎన్నడు లేని విధంగా వ్యాపారస్తులు ఎవరి షాపుల ముందు వారు రాఖీల అమ్మకోవడం అమ్మకాలు రాఖీల అమ్మకాని పెట్టడంతో మహిళలు పెద్ద ఎత్తున రక్షబంధన్ కొనుగోలు చేసేందుకు బాలురు తీరారు, ఈనెల 28వ తేదీన శుక్రవారం రాఖీ పౌర్ణమి కావడంతో సుదూర ప్రాంతాల లో ఉన్న మహిళలు వారి తోబుట్టువులకు రాఖీలు కట్టేందుకు రాఖీలను కొనుగోలు చేయడం జరిగింది, ఈ రాఖీ పండుగ అన్నా చెల్లెల అనురాగాలకు ప్రత్యేక గా నిలుస్తుందని నాటి నుండి నేటి వరకు కొన సాగుతున్న ఆచారమని చెప్పక తప్పదు,

# ఏది శాశ్వతం కాదు.. మంచితనం, పేరు మాత్రమే శాశ్వతం

- తెలంగాణ రాష్ట్రం కోసం పరితప్పించిన వ్యక్తి సుదర్శన్ రెడ్డి..
- ఆయన పోరాటం ఎప్పటికి చిరస్మరణీయం...
- మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ నామకరణం చేస్తాం, వారి కాంస్య విగ్రహాన్ని నెలకోల్పుతాం..
- ప్రతి నియోజకవర్గంలో వారి విగ్రహం పెట్టి వారిని గౌరవించుకుందాం..



**భూపాలపల్లి ఆగస్ట్ 27 పీపుల్స్ డైరీ..** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సాధనకై ఉద్యమ నాయకుడి ఉద్యమ బాటలో అలుపెరగని పోరాటం చేసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి సంతాప సభ కార్యక్రమాన్ని వరంగల్ జిల్లా జడ్పీ మాజీ చైర్పర్సన్ ఉ భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అధ్యక్షతన ఏర్పాటు చేయగా. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు,మాజీ లోక్ సభా సభ్యుడు బోయినిపల్లి వినోద్ కుమార్,భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, మరియు భూపాలపల్లి, నర్సంపేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్ది మరణించిన రోజున హరీష్ రావు, కేటీఆర్ గారే కాదు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉన్న మాజీ మంత్రులు, నాయకులు అందరూ కూడా వచ్చి అక్కడ కూర్చున్నారు. అది చూస్తుంటే ఎన్నో విషయాలు గుర్తొచ్చాయి, చాలా బాధగా అనిపించింది.ఆ రోజు పెద్దలు మాజీ మంత్రి మాట్లాడుతూ ప్రశాంత్ రెడ్డి, తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిన మొట్ట మొదటి ఎన్నికల్లో పెద్ది సుదర్శన్ రెడ్డి, ఓడిపోయినప్పుడు కేసీఆర్ ఎంతో బాధపడ్డారని చెప్పారు. అయ్యో పెద్ది ఓడిపోయాడే, అయ్యో పెద్ది ఓడిపోయాడే అని కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. ఆ రోజు పెద్ది సుదర్శన్ రెడ్డి, గెలిచి ఉంటే, బహుశా మంచి స్థానంలో ఉండి మంత్రిగా కూడా సేవలందించే అవకాశం వచ్చి ఉండేదేమో అని మాకు అనిపించింది. తర్వాత మేమంతా కలిసి మాట్లాడుకున్నాం. అందరూ ఎంతో ఆత్మీయంగా, మంచిగా మాట్లాడు కోవడం జరిగింది. ఏది ఏమైనా, ఈ రోజు పార్టీ మొత్తం ఆ కుటుంబానికి అండగా నిలిచింది. కేసీఆర్ స్వయంగా హాస్పిటల్‌కు రావడం, అదే విధంగా నల్లబెల్లికి వచ్చి దాదాపు అరగంట పాటు ఎంతో గంభీరమైన మౌనంతో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో గడపడం మనం చూశాం.అదే విధంగా హరీష్ రావు, కేటీఆర్, ఇతర నాయకులందరూ కూడా వచ్చి ఒక కుటుంబ సభ్యుడికి ఏ విధంగా అండగా నిలుస్తామో, అంతకంటే ఎక్కువగా పార్టీ వారి కుటుంబానికి అండగా నిలిచిందని మనమందరం చూశాం. దానిని మనమందరం గుర్తుంచుకొని ముందుకు సాగాలి. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆశయం ఏమిటో అందరూ చక్కగా వివరించారు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే మనమందరం కలిసి పని చేద్దామన్నారు. ఎందుకంటే ఈ రోజు ఎవరు ఏ కర్తవ్యంలో ఉన్నారో, ఆ కర్తవ్యాన్ని వంద శాతం నిబద్ధతతో నిర్వర్తించాలి. ఆ బాధ్యతలో ఉండి ఇటు అటు వెళితే, మనకు సమంజసమైన స్థానం దక్కదు. ఈ రోజు పెద్ది సుదర్శన్ రెడ్డి కి ఇంతటి ప్రజాభిమానం లభించిందంటే, ఆయన తన కమిట్‌మెంట్‌తో, నిబద్ధతతో ప్రజల కోసం పని చేశారు కాబట్టే. అందుకే ప్రజల హృదయాల్లో ఇంతటి ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. కాబట్టి మనమం దరం కూడా పార్టీ కోసం నిబద్ధతతో పని చేయాలి. సుదర్శన్ రెడ్డి ఎప్పుడూ ఒక మాట అనేవారు ఈసారి అనవసరంగా ఓడించిండ్రు. ఆ రేవంత్ రెడ్డిని ఎట్లా ముఖ్యమంత్రిని చేసిండ్రో ఏమో అర్థం కాదు. కానీ మళ్లీ మన సార్ రావాలి మళ్లీ మన సార్ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలి అని ఆయన నోటి నుంచి ఎప్పుడూ వినిపించేది.కాబట్టి రేపు మనమందరం పార్టీకి కంకణబద్ధులమై, ఒక్క తాటిపై నడిస్తే కేసీఆర్ గెలుపు, మన బీఆర్ఎస్ పార్టీ గెలుపు అవలీలగా సాధ్యమవుతుందని మీ అందరికీ మరోసారి గుర్తు చేస్తున్నాను.ఏది ఏమైనా, ఈ రోజు వారి కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదిం చాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. మనవంతు సహాయ సహకారాలు ఎప్పటికీ అందిస్తూ, ఆ కుటుంబానికి అండగా ని లుద్దామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. పెద్దలు వినోద్ కుమార్ మరియు పిలవగానే వచ్చి, ఓపికగా మన మధ్య ఇంతసేపు ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# నూతన పీఆర్సీ ప్రకటించి, ఈహెచ్‌ఎస్‌ను వెంటనే అమలు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నూతన పీఆర్సీ ప్రకటించి, ఈహెచ్‌ఎస్‌ను వెంటనే అమలు చేయాలి
- కరీంనగర్ జిల్లా టీజీఈ జేఏసీ డిమాండ్



**కరీంనగర్, ఆగష్టు 27,( పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ జేఏసీ పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా జేఏసీ కన్వీనర్ దారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ, జూలై 2023 నుంచి అమలు చేయాల్సిన నూతన పీఆర్సీని వాయిదా వేయడంతో పాటు ఆరు డీఏలను పెండింగ్‌లో ఉంచడం సరికాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన పీఆర్సీని జూలై 2023 నుంచి అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులన్నింటినీ ఏకమొత్తంగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నూతన ఈహెచ్ఎస్ పథకాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఉద్యోగులు, పెన్షనర్లకు అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. అదేవిధంగా స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయడంతో పాటు రాష్ట్ర పెన్షనర్ల కోసం ప్రత్యేక డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఏపీఆర్ హుజురాబాద్ అధ్యక్షుడు భారత ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి చీకట్ల సమ్మయ్య, బొంగోని వెంకటయ్య, చొల్లేటి మల్లారెడ్డి, మండల వీరస్వామి, గౌరిశెట్టి సాంబయ్య, తాటిపాముల కనుకయ్య, గాజర్ల బుచ్చిరాజం, పెదపాటి రమేష్, తిరునగరి రమేష్, పరాంకుశం సనత్ కుమార్, నల్లా రాజిరెడ్డి, చాడ సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ వైద్యులపై కఠిన నిఘా.. హైదరాబాద్ లో 12 మంది అరెస్ట్

- సజ్జనార్ తీవ్ర హెచ్చరిక
- నకిలీ వైద్యులపై హైదరాబాద్ పోలీసుల ఉక్కుపాదం
- విద్యార్హతలు లేని కొందరు డాక్టర్లమంటూ చెలామణి అవుతున్నారన్న సజ్జనార్
- నకిలీ డాక్టర్ల బారిన పడొద్దని ప్రజలకు హెచ్చరిక



వైద్యం పేరుతో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులపై హైదరాబాద్ నగర పోలీసులు ఉక్కుపాదం మోపారు. నగరంలో కనీస అర్హతలు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న నకిలీ వైద్యులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 12 మందిని గుర్తించి కఠిన చర్యలు తీసుకున్నామని పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు.కనీస వైద్య విద్యార్హతలు, ఎలాంటి పరిజ్ఞానం లేని కొందరు వ్యక్తులు తాము డాక్టర్లమంటూ చెలామణి అవుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులకు విచక్షణారహితంగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, బీపీ, డయాబెటిస్ మందులను ఇస్తూ, ఇష్టారీతిన ఇంజక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తున్నారని తెలిపారు. ఇటు వంటి శాస్త్రీయత లేని వైద్యం వల్ల బాధితుల ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలు దెబ్బతిని ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా నకిలీ డాక్టర్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. క్లినిక్ లేదా ఆసుపత్రి రిసెప్షన్ వద్ద డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ జారీ చేసిన అధికారిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉందో లేదో కచ్చితంగా గమనించాలని తెలిపారు. అలాగే వైద్యుడి బోర్డుపై పేరు, చదివిన విద్యార్హతలతో పాటు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ నంబర్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఒకవేళ వైద్యుడి అర్హతలపై కొద్దిగా అనుమానం వచ్చినా అధికారిక వెబ్‌సైట్ ద్వారా వివరాలు చెక్ చేసుకోవచ్చుని, రికార్డుల్లో వివరాలు కనిపించకపోతే ఆ వైద్యుడిని నకిలీగా పరిగణించవచ్చని స్పష్టం చేశారు.తీసుకుంటున్న చికిత్సపై సందేహాలు ఉంటే వెంటనే అర్హత కలిగిన మరో డాక్టర్ వద్ద 'సెకండ్ ఒపీనియన్' తీసుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాజంలో ఎవరైనా నకిలీ వైద్యులు చలామణి అవుతున్నట్లు తెలిస్తే వెంటనే 'డయల్ 112' కి గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలని కోరారు. ప్రజల ప్రాణాలతో ఆడుకునే నకిలీ డాక్టర్లపై నిరంతరం తనిఖీలు, కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# ఓటర్ల జాబితా సవరణ: ఫేక్ డాక్యుమెంట్లపై ఎన్నికల సంఘం గట్టి హెచ్చరిక

- ఓటర్ల జాబితా సవరణలో తప్పుడు పత్రాలిస్తే కఠిన చర్యలని హెచ్చరిక
- తెలంగాణ ఓటర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి హెచ్చరిక
- రాష్ట్రవ్యాప్తంగా 92 లక్షల మందికి పైగా ఓటర్లకు నోటీసులు జారీ
- తప్పుడు సమాచారమిస్తే జైలు శిక్ష తప్పదని స్పష్టం




తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎవరైనా తప్పుడు పత్రాలు సమర్పిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని, నకిలీ పత్రాలను సమర్పించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఓటర్లు సమర్పించే పత్రాలను, డిక్లరేషన్లను అధికారులు స్వతంత్రంగా ధ్రువీకరిస్తారని సీఈఓ కార్యాలయం వెల్లడించింది. ప్రభుత్వ అధికారికి తప్పుడు సమాచారం అందించడం భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 217 ప్రకారం శిక్షార్హమని పేర్కొన్నారు. అదేవిధంగా, ఓటర్ల జాబితా సవరణలో తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 31 ప్రకారం జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 2 లక్షల మందికి పైగా ఓటర్లకు నోటీసులు జారీ చేశారు. మొత్తం మీద 92.8 లక్షల మంది ఓటర్లకు నోటీసులు అందజేయనున్నారు. వీరిలో 60.5 లక్షల మంది ఓటర్ల డేటాలో వ్యత్యాసాలు ఉండగా, మరో 32.3 లక్షల మంది వివరాలు 2002 ఓటర్ల జాబితాతో సరిపోలడం లేదని అధికారులు గుర్తించారు. విచారణ సమయంలో ఓటర్లు గానీ, వారి కుటుంబ సభ్యులు గానీ తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలని అధికారులు సూచించారు. ఓటర్లు తమ వివరాల స్థితిని ఆన్‌లైన్‌లో మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, ఎపిక్ నంబర్ నమోదు చేసి, ఓటీపీ ద్వారా స్వయంగా ధ్రువీకరించుకోవచ్చని వెల్లడించారు.

# ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



**హసన్ పర్తి, ఆగస్ట్ 27 (పీపుల్స్ డైరీ) :** 66వ డివిజన్ పరిధిలోని పలు పాఠశాలల్లో బీజేపీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర నాయకులు, మాజీ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, డివిజన్ బీజేపీ నాయకులు ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గురుమూర్తి శివకుమార్ విద్యార్థులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆత్మీయతకు ప్రతీకగా రక్షాబంధన్ నిలుస్తుందని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో ఈ పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని వివరించారు.కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మారుపెల్లి రామచంద్రారెడ్డి, చకీలాం రాజేశ్వరరావు, దాసరి రాజు, పెద్దమ్మ శ్రీనివాస్, మట్టెడ సుమన్, కుంబర్కర్ సాయి తదితరులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డూప్లికేట్, మృతుల ఓట్లను నిబంధనల ప్రకారం తొలగించాలి



**హసన్ పర్తి, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) :** డూప్లికేట్, మృతుల పేర్లతో ఉన్న ఓట్లను పూర్తి నిబంధనల ప్రకారం పరిశీలించి ఓటరు జాబితా నుంచి తొలగించాలని హసన్పర్తి 66వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొర్రె కిరణ్‌కుమార్ అధికారులను కోరారు.హసన్పర్తిలోని విజయ గార్డెన్‌లో బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న ముసాయిదా ఓటరు జాబితా ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. జాబితాలోని అభ్యంతరాలు, చేర్పులు, మార్పులపై స్థానికులతో చర్చించారు. కొత్త ఓట్ల నమోదుతో పాటు ముసాయిదా జాబితాలో మార్పులకు సంబంధించిన సందేహాలను అధికారులు, బీఎల్ఏల సమక్షంలో నివృత్తి చేశారు.ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదన్నారు. 2026 అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి యువతీ, యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. తప్పులు లేని, పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా అర్హులైన ఏ ఒక్కరికీ ఓటు హక్కు దూరం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక తహసీల్దార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ బి ఆర్ ఎస్ అండగా ఉంటుంది..

## సీఎం సహాయ నిధి(ఎల్ ఓ సి)అందించిన మాజీ స్పీకర్



**రేగొండ ఆగస్టు 27 పీపుల్స్ డైరీ..** తెలంగాణ శాసనసభ మొదటి స్పీకర్, ప్రస్తుత బీఆర్ఎస్ శాసనసభ పక్ష నేత (ఎమ్మెల్సీ) సిరికొండ మధుసూదన చారి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రేగొండ మండలం జూబ్లీ నగర్ గ్రామానికి చెందిన ఆరుట్ల మహేందర్ కు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును(ఎల్ ఓ సి) హైదరాబాద్ లోని తన నివాసంలో అందజేశారు.ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రమైన గాయాలైనా మహేందర్ ను హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తీసుకుపోగా అక్కడ నుండి డాక్టర్లు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చేరాడు.కాగా చికిత్స కోసం చాలా ఖర్చు కాగా సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్నట్టు మాజీ స్పీకర్ మధుసూదన చారి కి తెలపడంతో ప్రత్యేక చొరవ తీసుకోవాలని గాయపడిన మహేందర్ కు లక్ష యాభై వేల రూపాయలు చెక్కు అందించారు.ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఖరీదైన వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరంలా ఉపయోగపడుతుందని మధుసూదన చారి తెలిపారు.నిరంతర సహాయం ఆపదలో ఉండి దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ నిధులు త్వరగా మంజూరయ్యేలా తాము ఎల్లప్పుడూ కృషి చేస్తామని ఆయన లబ్ధిదారులకు హామీ ఇచ్చారు.

# గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ లక్ష్యం



**సైదాపూర్ ఆగస్టు 27 ( పీపుల్స్ డైరీ ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి (రోడ్స్) శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంటోందనీ తెలిపారు. గురువారం అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఆయన పేర్కొన్నారు. మండలంలోని వెంకటేశ్వర పల్లి నుండి మహ్మదాపూర్ వరకు డబుల్ రోడ్డుకు రోడ్డు ప్రభుత్వం రూ. 11 కోట్ల 50 లక్షలు నిధులను మంజూరు చేయడం హర్షణీయమని అన్నారు. రోడ్డు బ్రిడ్జి నిర్మాణంతో వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల సమస్యలు తొలగిపోతాయని ముఖ్యంగా విద్యార్థులు రైతులు ఉద్యోగులు మరియు అత్యవసర సేవలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్నారని కౌడగాని మోహన్ రావు కొనియాడారు.

## 'రాంప్' పథకంతో మార్కెట్, ఆర్థిక అవకాశాలపై అవగాహన సదస్సు



**జమ్మికుంట, ఆగస్టు 28పీపుల్స్ డైరీ :** జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో, 'రైజింగ్ యాక్సిలరేటెడ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్' పథకం కింద, 'యాక్సెస్ టు మార్కెట్ అండ్ ఫైనాన్స్' అనే అంశం పై, బుధవారం రోజున ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా, రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రతినిధులు మరియు గ్రామీణ వ్యాపారవేత్తలకు మార్కెట్ అవకాశాలు, ఆర్థిక వనరులు, రుణ సదుపాయాలు, వ్యాపారాభివృద్ధి పై నిపుణులు అవగాహన కల్పించారు. చిన్న వ్యాపారాల స్థాపన, విస్తరణ, మార్కెట్ అనుసంధానత, ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవడం వంటి ముఖ్యాంశాలపై పలు సూచనలు చేశారు. అదేవిధంగా, వ్యవసాయ వ్యర్థాల నుంచి పైరోలిసిస్ ప్రక్రియ ద్వారా 'బయోచార్' తయారీ, దానిని నేలలో సేంద్రియ పదార్థాన్ని పెంచే సాయిల్ అమెండ్‌మెంట్‌గా వినియోగించే విధానాలపై శిక్షణ ఇచ్చారు. గ్రామీణ యువత, రైతులు విలువ ఆధారిత ఉత్పత్తుల వైపు దృష్టి సారించాలని పిలుపునిచ్చిన ఈ కార్యక్రమంలో, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఆరిఫ్ ఖాన్, కేవీకే హెడ్, శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్ రావు, ఇతర శాస్త్రవేత్తలు మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## వాణి విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు..



**రేగొండ ఆగస్టు 27 పీపుల్స్ డైరీ..** రేగొండ మండల కేంద్రంలోని శ్రీ వాణి విద్యానికేతన్ పాఠశాలలో రాఖీ పౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులకు రాకీ కట్టి వారి సేవలను కొనియాడారు. రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులు ఒకరికి ఒకరు రాఖీ కట్టి నువ్వు నాకు రక్ష నేను నీకు రక్ష మనం ఇద్దరం దేశానికి రక్ష అంటూ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ విశిష్టతను తెలియజేస్తూ ఆత్మీయత, సోదరభావంతో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, రాజు, రవీందర్, చంద్రమౌళి, రాజనర్సు, తాజొద్దీన్, దేవేందర్, సుమన్, ఓంకార్, ఆస్ఫియా, అశ్విని, షహీద, కరుణశ్రీ, సుమలత, అఖిల, రమ్య, మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఎస్ ఎస్ ఈవెంట్స్ షాప్ ప్రారంభించిన సర్పంచ్ మ్యాకమల్ల తిరుమల



**జమ్మికుంట అగస్ట్ 28 పీపుల్స్ డైరీ :** జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామ పంచాయతీ కాంప్లెక్స్ ఆవరణంలో అంబాల వంశీ, గంగారపూ వేణు సారథ్యంలో ఎస్ ఎస్ ఈవెంట్స్ ' డి. జె సౌండ్స్ , డెకరేషన్ , టెంట్ హౌజ్ ను బుధ వారం మడిపల్లి గ్రామ సర్పంచ్ మ్యాకమల్ల తిరుమల రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి వారికి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఎస్పీ హుజూరాబాద్ అసెంబ్లీ ఇంచార్జీ డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు) బీఎస్పీ సీనియర్ నాయకులు మారపల్లీ మోగిలయ్య, జర్నలిస్ట్ అంబాల శ్రీరామ్, వార్డు సభ్యులు గంగారపు సాయి రామ్, బోనగాని సురేష్, మాజీ ఉప సర్పంచ్, పోషిణి సత్యం, పోషాలు, గంగారపు ఐలయ్య, అప్పాలు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సమైక్య భవనానికి భూమిని విరాళంగా ఇచ్చిన రాయిశెట్టి మల్లయ్య బుచ్చమ్మ



**వీణవంక ఆగస్టు 28( పీపుల్స్ డైరీ) :** రాయిశెట్టి మల్లయ్య బుచ్చమ్మ వారి వంశీయులు వారసులు. మండల కేంద్రంలో మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమి లేక పోవడంతో గ్రామ సర్పంచ్ దాసరపు సరోజన రాజేంద్రప్రసాద్ పాలకవర్గం సభ్యులు సమస్యను వారి కుటుంబ సభ్యులకు వివరించగా వారందరూ మాకు పూర్వీకుల నుండి వారసత్వం గా వచ్చిన భూమిని వారి పేరు మీద ఇవ్వడానికి సమ్మతి తెలియజేస్తూ అందరూ గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంకు వచ్చి సర్పంచ్ తో పాటు మహిళా సంఘం సభ్యులకు అట్టి భూమిని వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా గ్రామానికి మహిళా భవన నిర్మాణానికి అందించినట్లు బాండ్ పేపర్ పై వ్రాయించి ఇచ్చారు.

# పాడి కౌశిక్ రెడ్డికి ఎథిక్స్ కమిటీ నోటీసులు.. బీఆర్ఎస్ ఫైర్

- కడియం శ్రీహరిపై వ్యాఖ్యల నేపథ్యంలో కౌశిక్ రెడ్డికి నోటీసులు
- కౌశిక్ రెడ్డిని రాజకీయంగా బలి చేసేందుకు కుట్ర జరుగుతోందన్న వేముల ప్రశాంత్ రెడ్డి
- సీఎం, కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలు ఎథిక్స్ కమిటీ పరిధిలోకి రావా? అని ప్రశ్న

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి తెలంగాణ శాసనసభ ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వచ్చిన ఫిర్యాదును విచారించేందుకు ఈ నెల 29న ఉదయం 11 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్-1లో ఎథిక్స్ కమిటీ సమావేశం కానుంది.అయితే, ఈ నోటీసులపై బీఆర్ఎస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. ఎథిక్స్ కమిటీ పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని... కౌశిక్ రెడ్డిని రాజకీయంగా బలిచేసేందుకే ఈ కుట్రలు పన్నుతోందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు దానం నాగేందర్, మందుల సామేల్, వీర్లపల్లి శంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్ గతంలో మాట్లాడిన తీవ్రమైన పదజాలం, అసభ్య సైగల వీడియోలను ఈ సందర్భంగా వేముల ప్రదర్శించారు. సభలో సీఎం, అధికార పక్ష నాయకులు చేసిన బెదిరింపులు, వ్యాఖ్యలు ఎథిక్స్ కమిటీ పరిధిలోకి రావా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు.అంతేకాకుండా, కౌశిక్ రెడ్డి వ్యవహారాన్ని స్పీకర్ సిఫార్సు చేసిన సమయంలో అసలు ఎథిక్స్ కమిటీయే మనుగడలో లేదని, అలాంటప్పుడు ఆ అంశాన్ని కమిటీకి ఎలా రెఫర్ చేస్తారని వేముల నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో లబ్ధి పొంది ఇప్పుడు అదే పార్టీపై విమర్శలు చేస్తున్న కడియం



శ్రీహరి వైఖరిని మాత్రమే కౌశిక్ రెడ్డి ఆక్షేపించారని, దీనిపై కక్షపూరితంగా వ్యవహరించడం కాంగ్రెస్ మార్క్ రాజకీయాలకు నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు.

# నేపాల్ వరదలు: తెలంగాణ వాసుల కోసం ఢిల్లీలో హెల్ప్‌లైన్!

- నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలంగాణ వాసులకు అండ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఢిల్లీలో ప్రత్యేక కేంద్రం
- విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయంతో సమన్వయం
- సహాయం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ల విడుదల

నేపాల్‌ను భారీ వరదలు ముంచెత్తుతున్న నేపథ్యంలో, అక్కడ చిక్కుకున్న తెలంగాణ వాసులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్, కోఆర్డినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ద్వారా బాధితులకు



అవసరమైన సహాయ సహకారాలను అందించనున్నారు.ఈ కేంద్రం ద్వారా కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ, ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయం, ఇతర ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని, బాధితుల విజ్ఞప్తులపై తక్షణమే స్పందిస్తామని అధికారులు తెలిపారు. నేపాల్‌లో ఉన్న తమ కుటుంబ సభ్యులు, యాత్రికులు, పర్యాటకులతో సంబంధాలు తెగిపోయిన వారు ఈ హెల్ప్‌లైన్ కేంద్రాలను సంప్రదించాలని ప్రభుత్వం సూచించింది.సహాయం కోరే వారు బాధితుల పేరు, పాస్‌పోర్ట్ వివరాలు, మొబైల్ నంబర్, నేపాల్‌లో వారు చివరిగా ఉన్న ప్రదేశం, టూర్ ఆపరేటర్ వివరాలు, కుటుంబ సభ్యుల సంప్రదింపు సమాచారాన్ని అందించాలని అధికారులు కోరారు. హెల్ప్‌లైన్ నంబర్లు: సహాయం అవసరమైన వారు రెసిడెంట్ కమిషనర్ పీ.ఎస్. వందన (9871999044), పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సి.హెచ్. చక్రవర్తి (9949351270), లైజన్ ఆఫీసర్ జి. రక్షిత్ నాయక్ (9618597969) నంబర్లలో సంప్రదించాలని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

# విజయ్‌లా మన హీరోలు గెలవలేరు..కారణం అదే: జయప్రకాశ్ నారాయణ

- విజయ్ తరహా విజయం తెలుగు హీరోలకు సాధ్యం కాదన్న జేపీ
- అవినీతి పోవాలంటారు కానీ ఉద్యమాలకు ముందుకు రారని విమర్శ
- 'ఒకే ఒక్కడు' తరహా అద్భుతాలు ఆశించడం ప్రమాదకరమన్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు
- వ్యవస్థాగత మార్పులకు 10-15 ఏళ్ల సమయం పడుతుందని వ్యాఖ్య

తమిళనాడులో నటుడు విజయ్ సాధించిన అఖండ రాజకీయ విజయం, తెలుగు రాష్ట్రాల్లోని సినీ హీరోలకు సాధ్యం కాదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ (జేపీ) అభిప్రాయపడ్డారు. ప్రజలు అవినీతి అంతం కావాలని కోరుకుంటారు కానీ, దానికోసం ఉద్యమించడానికి ముందుకు రారని, ఇదే ఇక్కడి ప్రధాన సమస్య అని ఆయన విశ్లేషించారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీ ఊహించని రీతిలో ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో జేపీ మాట్లాడుతూ "తమిళనాడులో విజయ్ తరహాలో ఇక్కడి సినీ హీరోలకు సాధ్యం కాదు. అవినీతి అంతమవ్వాలని కోరుకుంటారు.. ఉద్యమించడానికి మాత్రం ఎవరూ ముందుకు రారు. జెన్ జీ ఉద్యమించినా 10-15 ఏళ్ల తర్వాతే ఫలితాలు వస్తాయి" అని స్పష్టం చేశారు. రజినీకాంత్, కమల హాసన్ వంటి అగ్ర నటులకు కూడా దక్కని విజయాన్ని విజయ్ సాధించారని ఆయన గుర్తుచేశారు.ప్రస్తుత తరం, ముఖ్యంగా యువత (జెన్-జీ) 'ఒకే ఒక్కడు' సినిమాలో మాదిరిగా తక్షణ అద్భుతాలు జరగాలని ఆశిస్తున్నారని, ఇది ప్రమాదకరమైన ఆలోచనా విధానమని జేపీ హెచ్చరించారు. వ్యవస్థాగత మార్పులు, నిజమైన అభివృద్ధికి చాలా సమయం పడుతుందని, కేవలం ఒక్క వ్యక్తితో రాత్రికి రాత్రే మార్పు సాధ్యం కాదని ఆయన వివరించారు.తెలుగు రాష్ట్రాల్లో ప్రజల ఆలోచనా ధోరణి భిన్నంగా ఉందని, అవినీతి నిర్మూలన జరగాలని బలంగా కోరుకున్నప్పటికీ, దాని కోసం సమష్టిగా,



నిబద్ధతతో కూడిన ఉద్యమాలు చేపట్టేందుకు ముందుకు రావడం లేదని ఆయన వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది. ఈ కారణంగానే, ఇక్కడి సినీ హీరోలు రాజకీయాల్లోకి వచ్చినా విజయ్ స్థాయిలో విజయం సాధించడం కష్టమని జేపీ విశ్లేషించారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక: రేపటి నుంచి లక్కీడ్రా..

- ప్రత్యక్ష ప్రసారం
- హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ లబ్ధిదారుల ఎంపిక
- ఆగస్టు 28 నుంచి 31 వరకు లక్కీడ్రా ప్రత్యక్ష ప్రసారం
- 7,340 ఫ్లాట్ల కోసం 40,900 మంది మధ్య పోటీ
- మధ్యవర్తులను నమ్మొద్దన్న అధికారులు
- ఎంపిక కానివారికి రూ.10,000 ఈఎండీ వాపసు

నగరంలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ (ఎల్ఐజీ ఫ్లాట్లు) లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ఆగస్టు 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు పూర్తి పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని యూట్యూబ్, ఇతర సామాజిక



మాధ్యమాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనుండటం గమనార్హం. హైదరాబాద్ క్యూర్ (సీయూఆర్ఈ) పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మించిన 7,340 ఫ్లాట్ల కోసం మొత్తం 60,720 దరఖాస్తులు అందాయి. వీటిని పరిశీలించిన అధికారులు 40,900 మందిని అర్హులుగా గుర్తించగా, 19,820 దరఖాస్తులను వివిధ కారణాలతో అనర్హమైనవిగా తేల్చారు. అర్హులైన దరఖాస్తుదారుల నుంచే లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఈ ప్రక్రియపై హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ వీపీ గౌతం మాట్లాడుతూ.. "లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా జరుగుతుంది. మధ్యవర్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దు. డబ్బులు తీసుకుని ఫ్లాట్ ఇప్పిస్తామని ఎవరైనా చెబితే మోసపోకండి. డ్రా ప్రక్రియను దరఖాస్తుదారులు, మీడియా ప్రతినిధుల సమక్షంలో నిర్వహిస్తున్నాం" అని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సైతం ఈ వివరా లను వెల్లడించారు. రిజర్వేషన్ల ప్రకారం (ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, శానిటేషన్ వర్కర్లు) కేటాయింపులు జరుపుతామని తెలిపారు.ఆగస్టు 28న రాయదుర్గం, కేపీహెచ్‌బీ, 29న కొకూర్, పాటిగడ్డ, 30న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీ, బోయిన్‌పల్లి, 31న గాజులరామారం, అంబర్‌పేట, పోచారం వంటి ప్రాంతాల్లోని ఫ్లాట్లకు డ్రా నిర్వహిస్తారు. లక్కీ డ్రాలో ఫ్లాట్ పొందని వారికి వారు చెల్లించిన రూ.10,000 ఈఎండీ మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి తిరిగి జమ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దరఖాస్తుదారులు తేదీలు, లైవ్ స్ట్రీమింగ్ లింక్‌ల కోసం అధికారిక వెబ్‌సైట్లయిన ్ప్రప్రఫ్.వశ్రీఖఅస్త్రుఖు.ప్రశీజ.అఅ లేదా మీసేవా పోర్టల్‌ను సందర్శించాలని సూచించారు.

# నేపాల్ వరదల ప్రాంతాన్ని సురక్షితంగా దాటాం: డీఆర్డీఓ మాజీ చైర్మన్ సతీశ్ రెడ్డి



నేపాల్‌లో సంభవించిన ఘోర ఆకస్మిక వరదలు ప్రపంచాన్ని కుదిపేశాయి. ఈ ఘోర విపత్తుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు అందరినీ కలచివేస్తున్నాయి. మరోవైపు నేపాల్‌లో ఉన్న డీఆర్డీఓ మాజీ చైర్మన్ జి. సతీశ్‌రెడ్డి తమ క్షేమ సమాచారాన్ని వెల్లడించారు. తాము నేపాల్‌లో పూర్తి సురక్షితంగా ఉన్నామని, ప్రస్తుతం మానససరోవర్ యాత్ర నిమిత్తం ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. వరద ప్రభావం తీవ్రంగా ఉన్న ప్రాంతాన్ని తాము సురక్షితంగా దాటుకుని వెళ్లామని చెప్పారు. అయితే మరోవైపు నేపాల్‌ను ముంచెత్తిన ఈ ఆకస్మిక జలప్రళయం తీవ్ర విషాదాన్ని నింపింది. విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించిన అధికారిక వివరాల ప్రకారం వరదల ఉద్ధృతికి ఇప్పటివరకు 826 మంది ఆచూకీ గల్లంతయ్యారు. అంతేకాకుండా, వరద ప్రవాహంలో దాదాపు 300 మంది వరకు భారతీయులు కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ ప్రకటన చేశారు. ఈ దారుణ విపత్తులో మృతుల సంఖ్య ఇప్పటికే 175కి చేరుకోగా, రెస్క్యూ బృందాలు గాలింపు చర్యలను మరింత వేగవంతం చేశాయి.

# జిల్లా విద్యా సదస్సును విజయవంతం చేయాలని సీపీఎం పిలుపు

## ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

**మేడ్చల్ ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ):-** ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయాలని, విద్యా రంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు స్వస్తి పలకాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా విద్యా సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ మేడ్చల్‌లో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మేడ్చల్ మండల కార్యదర్శి ఎం. నరేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం--2020 (NEP-2020 విద్యారంగంలో పెద్ద మార్పులు తీసుకువస్తామని చెబుతున్నప్పటికీ, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం కంటే ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు మరింత అవకాశం కల్పించే విధంగా ఉందని విమర్శించారు. విద్యా వ్యవస్థ కేంద్రీకరణ, పాఠశాలల విలీనాలు, మూసివేతలు, ఉన్నత విద్యలో ప్రైవేట్ పెట్టుబడులకు పెరుగుతున్న అవకాశాల వల్ల పేద, మధ్యతరగతి, గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. NEP-2020 విద్యను కేంద్రీకరణ, కార్పొరేటీకరణతో పాటు కాషాయీకరణ దిశగా తీసుకెళ్తోందని నరేష్ ఆరోపించారు. సమానత్వం, సామాజిక న్యాయం, లౌకికత్వాన్ని కాపాడుతూ ప్రతి ఒక్కరికీ ఉచిత, నాణ్యమైన విద్య అందేలా విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని, సరిపడా తరగతి గదులు, టాయిలెట్లు అందుబాటులో లేకపోవడంతో పాటు ఉపాధ్యాయుల



ఖాళీలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నాయని తెలిపారు. మరోవైపు ప్రైవేట్ విద్యాసంస్థలు వేగంగా విస్తరిస్తున్నాయని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కేవలం కొన్ని మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేసి ప్రచారానికి పరిమితం కాకుండా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల నియామకాలు, నాణ్యమైన విద్యకు అవసరమైన వనరులు కల్పించాలని కోరారు. మేడ్చల్ మండలంలోనూ కార్పొరేట్ పాఠశాలల సంఖ్య పెరుగుతూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం పెరుగుతోందని నరేష్ అన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లను అమలు చేసేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మేడ్చల్ మండల కమిటీ నాయకులు కొమురయ్య, సభ్యులు ఎన్. కృష్ణ, స్వామి, ఎల్లం, సీహెచ్. కృష్ణ, నర్సింహా, శ్రీను, నిర్మల, అస్తరమా, రజిని తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్సీ, ఓపీఎస్, హెల్త్ స్కీమ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



- భూపాలపల్లి కలెక్టరేట్ వద్ద టి జి ఏ జె ఎ సి ఆధ్వర్యంలో ధర్నా

**భూపాలపల్లి ఆగస్ట్ 27 పీపుల్స్ డైరీ..** భూపాలపల్లి కలెక్టరేట్ వద్ద టి జి ఏ జె ఎ సి ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీజేఏసీ చైర్మన్ బూరుగు రవి మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రస్తుత పాలకులు ఉద్యోగులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పీఆర్సీని అమలు చేస్తామని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి ఇప్పటికే ముప్పై నెలలు గడిచినా ఆ హామీలు అమలు కాలేదని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ధర్నా ద్వారా ప్రభుత్వం వెంటనే స్పందించి మంచి ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. టి జి ఏ జె ఎ సి సెక్రటరీ జనరల్ శ్రీమతి విజయలక్ష్మి మాట్లాడుతూ, ఉద్యోగుల బేసిక్ పే నుంచి 1.5 శాతం చొప్పున డిడక్షన్ చేస్తున్నప్పటికీ ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్ అమలులో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు నెలలుగా హెల్త్ స్కీమ్‌కు సంబంధించి సమస్యలు కొనసాగుతున్నాయని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు వారి కుటుంబ సభ్యులకు అత్యవసర వైద్య పరిస్థితులు ఏర్పడిన సమయంలో కూడా సరైన వైద్య సదుపాయాలు అందకపోవడం బాధాకరమన్నారు. నూతన హెల్త్ స్కీమ్‌ను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి స్థాయిలో అమలు చేసి, అన్ని గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు, పించనరులకు వైద్య సేవలు అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న 6 డీఏలు, వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం జీఓ నంబర్ 25 పేరుతో ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తూ ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. జి ఓ 317 ప్రకారం మిగిలిపోయిన స్పౌస్ బదిలీలను వెంటనే చేపట్టాలని, స్థానికత ఆధారంగా జీఓ నంబర్ 190 ప్రకారం డిప్యూటేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. చాలా సంవత్సరాలుగా విద్యారంగంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఉపాధ్యాయ సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సుభాకర్ రెడ్డి, డీఆర్ మధుసూదన్, శ్రీనివాసరావు, రాజకుమార్, తిరుపతి, అజహర్, శ్రీనివాస్, శ్రీదేవి ప్రవీణ్, సాంబశివరావు, శ్రీనివాస్, కిరణ్ కుమార్, నక్క తిరుపతి, ఏ దశరథ రామారావు, షఫీ అహ్మద్ జ్ఞానేశ్వరసింగ్ మురళీధర్ రెడ్డి, కుమారస్వామి, మందల రవీందర్ రెడ్డి , లక్ష్మణబాబు ,చిలువేరు అశోక్, తిరుపతిరెడ్డి, సేవానాయక్, మధుసూదన్, రవీందర్, కుర్రే ప్రవీణ్ కుమార్, రమేశ్ నాయక్, రాచర్ల శ్రీనివాస్ , శ్రీనివాస్ రావు , మధుసూదన్ , స్వాతి ,అజహర్ , మల్లీశ్వరి. , దిల్షాద్ , భార్గవ్ , బోనాల రాజమౌళి , రామ చంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ 1000 రోజుల దగాపై బీఆర్ఎస్ సమరభేరి

- పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, గండ్ర జ్యోతి..

**భూపాలపల్లి ఆగస్ట్ 27 పీపుల్స్ డైరీ..** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో, కాంగ్రెస్ పాలనలో జరిగిన మోసాలు, నెరవేర్చని హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ చేపట్టనున్న కాంగ్రెస్ 1000 రోజుల దగాపై బీఆర్ఎస్ సమరభేరి కార్యక్రమం పై భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్ ఓ భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కార్యాచరణ పై సమావేశం నిర్వహించారు.



## మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ...

సెప్టెంబర్ 2వ తేదీ నుంచి వారం రోజుల పాటు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు ఎంతవరకు అమలు చేశారో ప్రజలకు వివరించాలని, అమలుకు నోచుకోని హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో బాకీ కార్డులతో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన తీరును ఎండగట్టాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు ఏం చేసిందో, ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేసిందో ప్రజల ముందు స్పష్టంగా ఉంచాలని అన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాన్ని బాకీ కార్డుల ద్వారా తెలియజేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ 1000 రోజుల దగాపై బీఆర్ఎస్ సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక - రాఖీ పండుగ

- ఘనంగా రాఖీ పండుగ వేడుకలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ హెచ్ఎం భారతి.....

**నారాయణపేట, ఆగస్టు 27 :** నారాయణపేట జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో జాజాపూర్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో విద్యార్థి విద్యార్థినులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని నీవు నాకు రక్ష నాకు నీవు రక్ష మనమందరము దేశానికి రక్ష నిదానంతో విద్యార్థులు ఆనందంగా ఒకరికొకరు రాఖీలు రక్షాబంధన్ కార్యక్రమంలో భాగంగా కట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాకేష్ మరియుపాఠశాలప్రధానోపాధ్యాయులు భారతి మాట్లాడుతూ , రక్షా బంధన్ లేదా రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమి లేదా జంధ్యాల పూర్ణిమ అని కూడా పిలుస్తారు. అన్నాచెల్లెళ్లు లేదా అక్కాతమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకంగా ఈ పండుగను జరుపుకుంటారు. అన్నకుగాని తమ్మునికిగాని ప్రేమ సూచకంగా సోదరి కట్టే రాఖీ అని పిలిచే ఒక పట్టీని



కట్టడం ఈ పండుగ ప్రాధాన్య విశేషం. రాఖీ అనగా రక్షణ బంధం. ఇది అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముళ్ళు జరుపుకునే మహోత్తరమైన పండుగ. చెల్లి తన అన్నయ్య మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ అన్నయ్యకు కట్టేదే ఈ రాఖీ. సాధారణంగా జంధ్యాన్ని ధరించేవారు ఈ రోజునే పాతది వదిలి కొత్త దానిని ధరిస్తారు. ఉపనయనం అయిన వారు జంధ్యాల పౌర్ణమి రోజు గాయత్రీ పూజచేసి కొత్త యజ్ఞోపవీతాన్ని ధరించి పాతది తీసివేస్తారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విజయ మధుసూదన్ భాను ప్రకాష్ నరసింహ ప్రతాప్ నర్సింలు రఘురాంరెడ్డి నిర్మల శ్రీదేవి శశిరేఖ మంగళ సంగీత మరియు గ్రామ ఉప సర్పంచ్ లక్ష్మణ్ సురేష్ బుద్ధి శ్రీనివాస్ చంద్రమోహన్ ఆలుగడ్డ రవి శ్రీధర్ లక్ష్మణ్ రవి తదితరులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కేశవపట్నంలో ఓటరు జాబితాపై గ్రామసభ



**శంకరపట్నం అగస్టు : 27 :** పీపుల్స్ డైరీ: మండలం లోని కేశవపట్నం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ జాబితా పరిశీలనలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. బీఎల్‌వోలు రూపొందించిన ఓటరు జాబితాను ప్రజల సమక్షంలో చదివి వినిపించారు. జాబితాలో పేర్లు, ఇంటిపేర్లు తప్పుగా ఉంటే ఫారం-8 ద్వారా సవరణ చేసుకోవాలని, కొత్తగా ఓటు నమోదు చేసుకునేవారు ఫారం-6 దరఖాస్తు చేసుకోవాలని సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్ సూచించారు. మృతి చెందిన వారి పేర్లు ఉంటే తొలగింపునకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసయ్య, ఆర్ఐ రాములు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్--ప్రజల మధ్య సోదరబంధం

## కీసరలో ఘనంగా రాఖీ పర్వదిన వేడుకలు



**మేడ్చల్ ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ ) :** రాఖీ పర్వదినాన్నిపురస్కరించుకుని కీసర పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కీసర గ్రామంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు, సహచరులు పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో కీసర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అర్కపల్లి ఆంజనేయులు, సబ్-ఇన్‌స్పెక్టర్లు బి. నాగరాజు, ఎస్. అనిల్ కుమార్, డి. జ్ఞానేందర్ రెడ్డి, కె. శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు పోలీసు అధికారులకు రాఖీలు కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మహిళలకు రాఖీ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల రక్షణలో పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. మహిళల భద్రత, రక్షణకు పోలీస్ శాఖ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. రాఖీ పర్వదినం సందర్భంగా పోలీసు అధికారులు, మహిళల మధ్య ఆత్మీయత, సోదరభావం వెల్లివిరిసింది. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగింది.

# మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్ కి రాఖీ కట్టి, శుభాకాంక్షలు తెలిపిన గండ్ర జ్యోతి



**భూపాలపల్లి ఆగస్ట్ 27 పీపుల్స్ డైరీ :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి కి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఆడబిడ్డలు, షైన్ స్కూల్ విద్యార్థినిలు రాఖీలు కట్టి తమ ఆప్యాయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా రమణన్న ఆడబిడ్డలకు శుభాకాంక్షలు, తెలియజేసి, వారి ప్రేమాభిమానాలు తనకు ఎంతో ఆనందాన్ని కలిగించాయని అన్నారు. అలాగే మాజీ ఎంపీ వినోద్ కుమార్ కు భూపాలపల్లి జిల్లా బి ఆర్ ఎస్ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి రాఖీ కట్టారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగ ప్రతి కుటుంబంలో ప్రేమ, ఆప్యాయతలను మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు. తమను అన్నగా భావించి రాఖీలు కట్టిన ప్రతి ఆడబిడ్డకు రమణన్న మాజీ ఎంపీ వినోద్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేస్తూ, మీ కష్టనష్టాలలో మీ తోబుట్టువులా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

# అత్వెల్లి ఉన్నత పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్ ఉత్సవాలు



**మేడ్చల్ ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ):-** అత్వెల్లి ఉన్నత పాఠశాలలో రక్షాబంధన్ ఉత్సవాలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా విద్యార్థినీ, విద్యార్థులకు రాఖీల తయారీ పోటీలు నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సుమారు 50 రాఖీలను స్వయంగా తయారు చేశారు. అనంతరం నిర్వహించిన రక్షాబంధన్ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు. “నీవు నాకు రక్ష.. నేను నీకు రక్ష.. మనిద్దరం పాఠశాలకు, దేశానికి రక్ష” అనే సందేశంతో పరస్పరం రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాణిక్యాల రావు మాట్లాడుతూ రక్షాబంధన్ పండుగ సోదరభావం, పరస్పర రక్షణ, ప్రేమ, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థుల్లో ఐక్యత, దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించడమే ఇటువంటి కార్యక్రమాల ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గడప నవీన్, వసీం, రంగారావు, రాంబాబు, మంజుల, స్వరూప రాణి, విజయలక్ష్మి, సోనీ తదితరులు పాల్గొన్నారు.

## క్రేన్‌పైకి ఎక్కి పనులను చూసిన సీఎం రేవంత్ రెడ్డి

**సస్పెన్షన్ బ్రిడ్జి పనులను క్రేన్‌పై నుంచి పర్యవేక్షించిన ముఖ్యమంత్రి**



హైదరాబాద్‌లోని మీరాలం చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఉదయం ఆకస్మికంగా పరిశీలించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జి పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. పనుల తీరును పరిశీలించేందుకు భారీ క్రేన్‌పైకి ఎక్కి మరీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం గమనార్హం. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి, పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. చెరువులోకి ఎలాంటి పరిస్థితుల్లోనూ మురుగునీరు వచ్చి చేరకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మీరాలం నుంచి మూసీలోకి వరద నీరు సులభంగా వెళ్లేలా నాలాను విస్తరించాలని కూడా సూచించారు. చెరువులో ఉన్న ఐల్యాండ్‌ను అభివృద్ధి చేయాలని, వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేందుకు వీలుగా డిజైన్ రూపొందించాలని తెలిపారు. మొత్తంమీద మీరాలం చెరువును ఒక ప్రధాన పర్యాటక ఆకర్షణ కేంద్రంగా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



**ధర్మారం:** మండలంలోని పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో గురువారం రోజున ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూతి మల్లన్న మాట్లాడుతూ... మన భారతీయ సంస్కృతిలో ప్రతీ పండుగకు ఎంతో విశిష్టత ఉంటుందని అన్నారు. ఈ రక్షాబంధన్ సోదరభావానికి ప్రతీక అని, సమాజంలో ఐక్యతకు నిదర్శనం ఈ పండుగ అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒకరికొకరు "నేను నీకు రక్ష, నీవు నాకు రక్ష, మనమందరం దేశానికి, ధర్మానికి రక్ష" అంటూ రాఖీలు కట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జూలపల్లి ఖండ్ వ్యవస్థా ప్రముఖ్ చింతల ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు గంద్రాతి శ్రీలత, అనుమల్ల శారద, సిరిపురం సునీల్, చెక్కపల్లి అరుణశ్రీ, నాగెల్లి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వార్డులలో బీజింగ్ పౌడర్ చెల్లింపు కార్యక్రమం



**నారాయణపేట ఆగస్టు 27:** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలోని ప్రతి వార్డులలో డ్రైనేజీలలో బీజింగ్ పౌడర్ చెల్లింపు కార్యక్రమాన్ని గురువారం మరికల్ గ్రామ సర్పంచ్ చెన్నయ్య ఆధ్వర్యంలో  చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చెన్నయ్య మాట్లాడుతూ మరికల్ గ్రామంలోని ప్రతి వార్డులలో ప్రతి డ్రైనేజీలలో బ్లీచింగ్ పౌడర్ చల్లింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల మహా ధర్నాకు మాజీ మంత్రి సంఘీభావం




**జగిత్యాల టౌన్ :** జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ తెలంగాణ ఎంప్లాయీస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన మహా ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన 6 పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలని, 2వ పీఆర్సీని అమలు చేయాలని, ఉద్యోగులకు సంబంధించిన సుమారు రూ.10 వేల కోట్ల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు ఈజుహెచ్ఎస్ విధి విధానాలను వెంటనే అమలు చేయాలని కోరారు. జగిత్యాల కలెక్టరేట్ వద్ద జరిగిన ఈ మహా ధర్నాలో ఉద్యోగ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారి న్యాయమైన డిమాండ్లకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా, వారి న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు.

# ఐదేళ్లుగా బీఎల్‌ఓలకు అందని గౌరవ వేతనం

**రూ.90 లక్షలకు పైగా బకాయిలు ఉన్నట్లు అంచనా**

- ఎన్నికల విధుల్లో కీలకంగా పనిచేస్తున్న 92 మంది బిఎల్‌ఓలు



**మేడ్చల్:** ఎన్నికల ప్రక్రియలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న బూత్ లెవల్ అధికారులకు బిఎల్‌ఓ ఏళ్ల తరబడి గౌరవ వేతనం అందకపోవడం చర్చనీయాంశంగా మారింది. మేడ్చల్ సర్కిల్, మేడ్చల్ తహసీల్దార్ పరిధిలోని మొత్తం 92 మంది దీూలకు సుమారు ఐదేళ్లుగా గౌరవ వేతనం పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. దీంతో వారికి రావాల్సిన బకాయిలు రూ.90 లక్షలకు పైగా ఉండే అవకాశం ఉందని అంచనా.

### ఓటర్ల జాబితాలో బిఎల్‌ఓ లదే కీలక పాత్ర

ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించడం, కొత్త ఓటర్ల వివరాలను సేకరించడం, నమోదుకు సంబంధించిన ప్రక్రియలో సహకరించడం, చిరునామాలు, ఇతర వివరాల్లో మార్పులను పరిశీలించడం, మరణించిన లేదా అర్హత కోల్పోయిన ఓటర్లను గుర్తించడం వంటి కీలక బాధ్యతలను బి ఎల్ వో లు నిర్వహిస్తున్నారు. ఎన్నికలు సమీపించిన సమయంలో వారి బాధ్యతలు మరింత పెరుగుతాయి. ఓటర్ల జాబితా సవరణ, డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ పరిశీలన, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, ఇంటింటి సర్వేలు, ఓటర్ల వివరాల ధ్రువీకరణ వంటి పనులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.

### ఒక్కొక్కరికి రూ.18 వేల వరకు

ప్రస్తుతం ఒక్కో దీూకు ఏడాదికి సుమారు రూ.18 వేల వరకు గౌరవ వేతనం రావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఐదేళ్లకు లెక్కిస్తే ఒక్కో బిఎల్‌ఓకు సుమారు రూ.90 వేల వరకు బకాయి ఉండే అవకాశం ఉంది. 92 మంది బిఎల్‌ఓలను పరిగణనలోకి తీసుకుంటే ఈ మొత్తం సుమారు రూ.82.80 లక్షలు అవుతుంది. అయితే గౌరవ వేతనంలో సంవత్సరాల వారీగా మార్పులు, మధ్యలో జరిగిన చెల్లింపులు, ఇతర బకాయిలను పరిగణనలోకి తీసుకుంటే వాస్తవ మొత్తం మారే అవకాశం ఉంది. అందువల్ల సంబంధిత అధికారులు పూర్తి వివరాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

### విధులు నిరంతరం.. చెల్లింపులు మాత్రం పెండింగ్

ఎన్నికలు లేని సమయంలోనూ ఓటర్ల వివరాల పరిశీలన, జాబితా సవరణ తదితర పనులు కొనసాగుతూనే ఉంటాయి. ఎన్నికల సమయంలో ఇంటింటి సర్వేలు, ఓటర్ల వివరాల ధ్రువీకరణతో పాటు అదనపు విధులు కూడా బి ఎల్ ఓ లు లపై పడతాయి. ఇంతటి బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ గౌరవ వేతనం సంవత్సరాల తరబడి అందకపోవడం పట్ల బి ఎల్వోలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించేందుకు అయ్యే ప్రయాణ ఖర్చులు, సమయాన్ని దృష్టిలో పెట్టుకుని పెండింగ్ మొత్తాలను వెంటనే చెల్లించాలని వారు కోరుతున్నారు.

### అధికారుల దృష్టి సారించాలి

పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలపై సంబంధిత ఎన్నికల అధికారులు సమగ్రంగా పరిశీలించాలని బి ఎల్ వో లలు కోరుతున్నారు. ఎన్నికల కమిషన్ నుంచి నిధులు విడుదలయ్యాయా? విడుదలైతే చెల్లింపులు ఎందుకు నిలిచిపోయాయి? బిల్లుల ప్రక్రియలో సమస్యలేమైనా ఉన్నాయా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గత ఐదేళ్లకు సంబంధించిన బకాయిలను సంవత్సరాల వారీగా లెక్కించి, ప్రతి బీఎన్‌ఓలకు చెల్లించాల్సిన మొత్తాన్ని నిర్ధారించాలని కోరుతున్నారు. అనంతరం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పెండింగ్ గౌరవ వేతనాలను త్వరితగతిన విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఎన్నికల వ్యవస్థలో కీలక సిబ్బందికి న్యాయం ఎప్పుడు?

ఓటర్ల జాబితా నుంచి పోలింగ్ ప్రక్రియ వరకు ఎన్నికల వ్యవస్థలో బిఎల్‌ఓల సేవలు అత్యంత కీలకం. అలాంటి సిబ్బందికి రావాల్సిన గౌరవ వేతనం సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉండటంపై అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. మేడ్చల్, గుండ్లపోచంపల్లి పరిధిలోని 92 మంది బీఎల్‌ఓలకు సంబంధించిన బకాయిలను పూర్తిగా నిర్ధారించి, అర్హత మేరకు వెంటనే చెల్లించాలని వారు కోరుతున్నారు.

# ప్రీపెయిడ్ విద్యుత్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి

- కరెంట్‌కు కూడా రీఛార్జేనా..!?
- స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకం కాదు.. ముందస్తు చెల్లింపు విధానాన్నే ఖండిస్తున్నాం
- పేదల నెత్తిన మరో భారం వద్దని కోరుట్లలో ధర్నా-రాస్తారోకో
- సామాన్య ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదు: టీఆర్ఎస్ కోరుట్ల ఇన్‌చార్జ్ డా. రఘు



**కోరుట్ల :** విద్యుత్ వినియోగానికి ముందుగానే డబ్బులు చెల్లించే ప్రీపెయిడ్ విధానాన్ని తీసుకురావాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ విధానం అమల్లోకి వస్తే ముఖ్యంగా పేద, గ్రామీణ వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని టీఆర్ఎస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా. రఘు అన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆయన ఆధ్వర్యంలో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం కోరుట్ల బస్టాండ్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, అయితే విద్యుత్ సరఫరాను ముందస్తు రీఛార్జ్‌తో ముడిపెట్టే ప్రీపెయిడ్ విధానాన్ని మాత్రం తీవ్రంగా ఖండిస్తున్నామని డా. రఘు స్పష్టం చేశారు.

### మొబైల్ మాదిరిగా విద్యుత్ రీఛార్జ్‌నా.?

ధర్నాలో డా. రఘు మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్‌కు రీఛార్జ్ చేసుకుంటేనే సేవలు అందుబాటులోకి వచ్చినట్లుగా విద్యుత్‌కు కూడా ముందుగా డబ్బులు చెల్లించి రీఛార్జ్ చేసుకుంటేనే సరఫరా జరిగే విధానం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందని అన్నారు. విద్యుత్ ప్రతి కుటుంబానికి నిత్యావసర సేవగా మారిన పరిస్థితుల్లో ముందుగానే డబ్బులు చెల్లించి వినియోగించుకోవాల్సిన విధానం సామాన్యులకు అనుకూలంగా ఉండదని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ప్రతి సమయంలో రీఛార్జ్ కోసం డబ్బులు సిద్ధంగా ఉంచుకోవడం భారంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

### గ్రామీణ పేదలపైనే ఎక్కువ ప్రభావం

ప్రభుత్వ నిర్ణయం ముఖ్యంగా పేద, గ్రామీణ వర్గాల ప్రజలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని డా. రఘు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ముందస్తు రీఛార్జ్ విధానం గురించి పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో మరిన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగం, రీఛార్జ్, బ్యాలెన్స్ వంటి అంశాల్లో సాంకేతిక అవగాహన లేని వినియోగదారులు ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా ప్రభుత్వం ముందుగా ప్రజలకు పూర్తి వివరాలు తెలియజేయాలని కోరారు. ఈ విధానాన్ని ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు కూడా వ్యతిరేకించాయని డా. రఘు గుర్తుచేశారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ విధానాలపై ప్రభుత్వం పునరాలోచించాల్సిన అవసరం ఉందన్నారు.

### విధివిధానాలు రాతపూర్వకంగా వెల్లడించాలి

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం స్పష్టంగా రాతపూర్వకంగా ప్రజలకు అందించాలని డా. రఘు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ వినియోగం, బిల్లింగ్ విధానం, ప్రీపెయిడ్ విధానం తదితర అంశాలపై వినియోగదారులకు ఎలాంటి సందేహాలు లేకుండా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రజలకు పూర్తి సమాచారం అందించిన తర్వాతే ఏదైనా కొత్త విధానాన్ని అమలు చేయాలని సూచించారు.

### పాంచజన్య సంకల్పం అమలు చేయాలి

టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రతిపాదిస్తున్న పాంచజన్య సంకల్పంలోని అంశాలను ప్రజలకు అందించాలని డా. రఘు కోరారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, యువతకు ఉపాధి, రైతు భరోసా, సామాజిక న్యాయం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు. సామాన్య ప్రజలపై అదనపు భారాన్ని మోపే విధానాల కంటే ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.

# ఓటే ప్రజాస్వామ్యానికి బలం.. ప్రతి ఓటూ కీలకమే.!

- ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలి
- సమగ్ర ఓటరు జాబితా సవరణలో ప్రజలంతా భాగస్వాములు కావాలి
- ఓటరు మ్యాపింగ్‌పై ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి



**కోరుట్ల :** ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించి, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు, తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కోరుట్ల పట్టణంలోని 13వ వార్డులోని 143, 145 బూత్‌లతోపాటు 6వ వార్డులోని 125, 126, 127 బూత్‌ల పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)పై వార్డు సభలు నిర్వహించారు. ప్రజలకు ఓటు హక్కు ప్రాధాన్యత, ఓటరు జాబితా సవరణకు సంబంధించిన విధివిధానాలపై అవగాహన కల్పించారు.

### ఓటరు జాబితాలో ప్రతి వివరమూ సరిగా ఉండాలి

13వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, 6వ వార్డు కౌన్సిలర్ మేడిపల్లి శిరీష శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వార్డు సభల్లో జువ్వాడి నర్సింగరావు, మానాల మోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు ఉండేలా చూడటంతోపాటు, వివరాల్లో తప్పులు ఉంటే వాటిని సరిచేయించుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఓటరు మ్యాపింగ్‌పై ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.

### అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి లభించిన కీలక హక్కు అని, దానిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత కూడా ప్రతి ఒక్కరిపై ఉందని నాయకులు పేర్కొన్నారు. అర్హత ఉన్నప్పటికీ ఓటరు జాబితాలో పేరు లేని వారు వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకుని తప్పులు ఉంటే సవరణకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఓటరు జాబితా సవరణ, మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా ప్రతి వార్డులో వార్డు సభలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు వారు తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న సభలను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని కోరారు.

### ఫారం 6.. 7.. 8పై అవగాహన

కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఓటరు జాబితాలో వివరాల సవరణ కోసం ఫారం-8 సమర్పించాలని, ఓటరు జాబితాలోని పేరుపై అభ్యంతరం ఉంటే ఫారం-7 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు, ప్రజాప్రతినిధులు వివరించారు. ఓటరు జాబితాలో పేరు లేకపోతే సంబంధిత ధ్రువపత్రాలను బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌ఓలకు) అందజేసి అవసరమైన ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి సందేహాలు ఉన్నా బీఎల్‌ఓలను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని తెలిపారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలను సరిచేసేలా ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

### ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర సవరణ

ఓటరు జాబితా సవరణ అనేది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, అర్హులైన ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని నాయకులు అన్నారు. ప్రజలు తమ ఓటరు వివరాలను స్వయంగా పరిశీలించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎన్నికల సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను నివారించవచ్చని పేర్కొన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ హక్కును కాపాడుకోవడంతోపాటు, ఓటరు జాబితా సక్రమంగా ఉండేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు.

# వైరా మున్సిపాలిటీ లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపర్చాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**





ఖమ్మం, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) : వైరా మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, రోడ్లు, విద్యుత్, త్రాగునీరు, పౌర సేవల మెరుగుదలకు ప్రత్యేక చొరవ చూపాలని, పట్టణంలో ప్రజలకు మౌళిక వసతులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్, వైరా పురపాలక కార్యాలయంలో పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, పురపాలక ఆర్థిక స్థితిగతులపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. వైరా మున్సిపాలిటీ కి మంజూరు చేసిన అభివృద్ధి పనులు, పురోగతి, డంపింగ్ యార్డ్, రోజు వారి తడి, పొడి చెత్త సేకరణ, పన్నుల వసూళ్ల వివరాలు, జరుగుతున్న అభివృద్ధి పనులు, ఆర్థిక సంఘం నిధులు, డిఎంఎఫ్టీ నిధులు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా చేపట్టిన పనుల వివరాలు, వాటి స్థితిగతులను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... వైరా పురపాలకంలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. పట్టణంలో నూతనంగా చేపడుతున్న సిసి రోడ్లు, బీటీ రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రైయిన్స్ సంపూర్ణ వివరాలతో కూడిన నివేదిక సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పట్టణంలో ప్రాధాన్యత క్రమంలో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. మున్సిపాలిటీ ఆదాయం పెరిగితే ప్రజలకు మరిన్ని మౌళిక వసతులు, పౌర సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి వాటికి ప్రాధాన్యత ఇవ్వడం, మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగించడం, చేపట్టిన పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా వైరా మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వైరా రిజర్వాయర్ ఆనకట్ట సమీపంలోని డంపింగ్ యార్డ్ స్థలాన్ని, నిరుపయోగంగా ఉన్న మత్స్యశాఖ భవనాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, వైరా మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రావు, తహసీల్దారు సురేష్, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల అనుమతుల్లో ఎలాంటి జాప్యం ఉండొద్దు

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- టీజీ ఐపాస్ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) : జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అనుమతుల మంజూరులో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు.

కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి టీజీ ఐ-పాస్ సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో కలిసి పరిశ్రమల స్థాపనకు సంబంధించిన దరఖాస్తులు, అనుమతుల మంజూరు, పారిశ్రామిక ప్రోత్సాహకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను నిర్ణీత గడువు లోగా మంజూరు చేయాలని, అనుమతుల ప్రక్రియలో అనవసర జాప్యం జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

**-రూ. 2.58 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలకు ఆమోదం**

డీఐపీసీ సమావేశంలో మొత్తం 22 యూనిట్లకు వివిధ పారిశ్రామిక ప్రోత్సాహకాల క్రింద రూ. 2,58,18,743 మంజూరుకు ఆమోదం లభించింది. పెట్టుబడి సబ్సిడీ క్రింద ఎస్టీ కేటగిరీకి చెందిన 8 యూనిట్లకు రూ.1,83,27,581, ఎస్సీ కేటగిరీకి చెందిన 8 యూనిట్లకు రూ. 69,13,112, ఓసీ కేటగిరీకి చెందిన 2 యూనిట్లకు రూ. 2,72,232 ప్రోత్సాహకాలకు ఆమోదం తెలిపారు.

పరిశ్రమల అనుమతుల ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తూ పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జీఎం ఇండస్ట్రీస్ ప్రవీణ్ కుమార్, ఎల్‌డీఎం రవి ప్రసాద్, ఆర్టీఓ శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముజాహిద్, ఇండస్ట్రీస్ ఏడి నకుల్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తీజ్ పండుగ బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

**మంత్రి సీతక్క**



గోవిందరావుపేట, ఆగస్టు 27( పీపుల్స్ డైరీ) బంజారా సాంస్కృతి, సాంప్రదాయాలకు తీజ్ పండుగ ప్రతీకాను పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దన సరి సీతక్క అన్నారు, ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మండల పరిధిగురువారం పసరలో బంజారా సోదర, సోదరీమణులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే తీజ్ పండుగ వేడుకలు అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటుందని ఆమె పాల్గొన్నారు. పసర గ్రామంలో సర్పంచ్ బూక్యా సుమలత గృహంవద్ద ఏర్పాటు చేసిన తీజ్ ఉత్సవాల్లో మంత్రి సీతక్క పాల్గొని బంజారా సోదర, సోదరీ మణులకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా తీజ్ పండుగ శుభసందర్భంగా సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నమస్కరించిన మంత్రి సీతక్క, బంజారా సమాజం అభివృద్ధి, సంక్షేమం కోసం సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

బంజారా సమాజానికి తీజ్ పండుగ ఎంతో ప్రత్యేకమైనదని మంత్రి సీతక్క అన్నారు. ప్రకృతి పట్ల ప్రేమ, కుటుంబ బంధాలు, మహిళల భక్తిశ్రద్ధలు, సంప్రదాయాల పరిరక్షణ వంటి అనేక గొప్ప విలువలను తీజ్ పండుగ ప్రతిబింబిస్తుందని తెలిపారు. తరతరాలుగా వస్తున్న బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

తీజ్ పండుగ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ, పాటలు పాడుతూ, నృత్యాలతో ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం బంజారా సంస్కృతిలోని వైవిధ్యాన్ని చాటుతుందని మంత్రి సీతక్క అన్నారు. సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. బంజారా సమాజ సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, విద్య, ఉపాధి, అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. ప్రతి కుటుంబం సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ములుగు గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రేగ కళ్యాణి, మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ, ములుగు జిల్లా కార్మిక శాఖ అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారామ్ నాయక్ తో పాటుగా గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు అందరూ పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



శాయంపేట, ఆగస్టు 27, (పీపుల్స్ డైరీ): భూపాలపల్లి నియోజకవర్గంలోని శాయంపేట మండలంలో గట్లకానిపర్తి, శాయంపేట , పెద్దకోడేపాక గ్రామాల రైతు వేదికలలో నిర్వహించిన కార్యక్రమాల్లో భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని అనేక ప్రజాహిత కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రతి అర్హత గల కుటుంబానికి ఆహార భద్రత కల్పించాలనే లక్ష్యంతో స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నో సంవత్సరాలుగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూసిన కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తోందని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పారదర్శకంగా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందుతాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధి, రైతుల సంక్షేమం, పేదల జీవన ప్రమాణాల మెరుగుదలకు కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధికార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# బాలికల హక్కులు, స్వీయ రక్షణ అవగాహన



నూగురు వెంకటాపురం, ఆగస్టు 27(పీపుల్స్ డైరీ) : కాఫేడు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కస్తూర్బా బాలికల హాస్టల్లో బాలికలకు హక్కుల పరిరక్షణ, స్వీయ రక్షణ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉపాధ్యాయుడు పి. సూర్యనారాయణ, కస్తూర్బా పాఠశాల పిటి కె. శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. బాలికల హక్కులను పరిరక్షించడం, వారికి తమ హక్కులపై అవగాహన కల్పించడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, స్వీయ రక్షణ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఎంతో అవసరం అన్నారు. ముఖ్యంగా బాలికలకు బాలల హక్కులు, విద్యా హక్కు, రక్షణ హక్కు, సమానత్వం, బాల్య వివాహాల నివారణ తమకు ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే విధానాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా బాలికలు ప్రమాదకర పరిస్థితుల్లో తమను తాము సురక్షితంగా కాపాడుకునే విధంగా ప్రాథమిక స్వీయ రక్షణ శిక్షణ తప్పనిసరి అన్నారు. “కేర్ అండ్ షేర్” భావన ద్వారా బాలికలు ఒకరినొకరు గౌరవించడం, సహాయం చేసుకోవడం, సమస్యలను పంచుకోవడం మరియు పరస్పరం ప్రోత్సహించుకోవడం నేర్చుకుంటారని తెలిపారు. బాలికల భద్రత, గౌరవం, భవిష్యత్తు కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని, ప్రతి బాలిక భయంలేకుండా, ఆత్మవిశ్వాసంతో, సురక్షితమైన వాతావరణంలో ఎదగడానికి ఇటువంటి అవగాహన శిక్షణ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలియ చేశారు.

అదేవిధంగా పిటి శైలజ యోగ శిక్షణ ఇవ్వటం జరిగింది. అనంతరం మాట్లాడుతూ.. యోగ చేయటం వలన శరీరం ఆరోగ్యంగా చురుకుగా ఉంటుందని, ఏకాగ్రత జ్ఞాపక శక్తి మెరుగుపడటానికి సహాయ పడుతుందన్నారు. ఆత్మ విశ్వాసం ప్రశాంతత పెరుగుతాయని తెలిపారు. కరాటే బ్లాక్ బెల్ట్ ఫిఫ్త్ డాన్ జి హనుమంత్ బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ పైన కరాటే నేర్పించారు. కరాటే వల్ల శారీరక దృఢత్వం, ఆత్మ విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి వెంకటాపురం మండల కోఆర్డినేటర్ జి హనుమంత్, యానిమేటర్స్ ఉషా, ఇందిరా, పద్మ, ప్రశాంత్, నరేశ్, కస్తూర్బా పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి: హైకోర్టు సిజెకి విజ్ఞప్తి



నల్లబెల్లి, ఆగస్ట్ 27 (పీపుల్స్ డైరీ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిరంతరాయంగా కొనసాగించాలని కోరుతూ నల్లబెల్లి మండల కేంద్రంలోని సబ్ పోస్ట్ ఆఫీస్ ద్వారా తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి, సామాజిక ఉద్యమ నేత బట్టు సాంబయ్య విజ్ఞాపన పత్రం (వినతిపత్రం) పంపారు. ఈ సందర్భంగా తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి, సామాజిక ఉద్యమ నేత బట్టు సాంబయ్య మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఆడపిల్లల పెళ్లిళ్ల విషయంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఈ పథకాలు కొండంత అండగా నిలుస్తున్నాయని తెలిపారు. మానవతా దృక్పథంతో ఆలోచించి, ఇట్టి పథకాలను యథావిధిగా అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి తగిన ఆదేశాలు జారీ చేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని హృదయపూర్వకంగా వేడుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంది శ్రీనివాస్, రాజిరెడ్డి, స్థానిక ఎస్పీఎం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులకు రాఖీలు కట్టిన “ప్రోబెల్” ఉపాధ్యాయినీలు

గణపురం, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) : గణపురం మండల కేంద్రంలోని “ప్రోబెల్ మోడల్ హైస్కూల్‌లో” గురువారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయినీలు అందరూ కలిసి సుమారు వంద మంది విద్యార్థుల తల్లిదండ్రులకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. అనంతరం వారికి స్వీట్లు అందజేసి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ... రక్షాబంధన్ పండుగ విశిష్టత, సోదరసోదరీమణుల మధ్య ఉండే ఆత్మీయత, ప్రేమానురాగాల గురించి వివరించారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు పరస్పరం ఆప్యాయత, గౌరవం, బాధ్యతా భావాలను పెంపొందించడమే రక్షాబంధన్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై సోదరభావాన్ని వ్యక్తం చేస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు శిక్షణ



గణపురం, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) : ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు, సమీకృత పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ఈ మేరకు గురువారం గణపురం మండలంలోని మైలారం గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) భూపాలపల్లి ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి డి. ఐలయ్య రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంటలో కాండం తొలుచు పురుగు నివారణకు ఎకరానికి 8 నుంచి 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఇసుకలో కలిపి చల్లుకోవాలని సూచించారు. పత్తి పంటలో పచ్చదోమ, తెల్లదోమ వంటి రసం పీల్చే పురుగుల నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని వివరించారు. రైతులు పంటల పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్య సమ్మయ్య, ఉపసర్పంచ్ లావణ్య, ఏఈఓ కళ్యాణ్, రైతులు పాల్గొన్నారు.

# బి ఆర్ పురం హై స్కూల్ లో ముందస్తుగా రాఖీ పౌర్ణమి వేడుకలు





ఏన్కూరు ఆగస్టు 27 పీపుల్స్ డైరీ : మండల పరిధిలోనీ బి ఆర్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ముందస్తుగా అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రేమానురాగాలకు, రక్షణభావానికి ప్రతీకగా రాఖీ పండుగ (రక్షాబంధన్) జరుపుకున్నారు. పండుగ ప్రాముఖ్యత మరియు విశిష్టత, రక్షణ బంధం గురించి పాఠశాల హెచ్ఎం సాగి సుజాత వివరించారు. ఈ కార్యక్రమంలో బురద రాఘవాపురం గ్రామ ఉపసర్పంచ్ వెంకట నారాయణ మాట్లాడుతూ రాఖీ అనగా ‘రక్షణ బంధం’ బంధం అని ,సోదరుడు ఎల్లప్పుడూ క్షేమంగా ఉండాలని, జీవితంలో ఉన్నత స్థానానికి చేరాలని కోరుకుంటూ చెల్లి,అక్క తన అన్నదమ్ముల చేతికి రాఖీ కడుతుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామ ఉపసర్పంచ్ బరపటి వెంకటనారాయణ, పాఠశాల హెచ్ఎం సాగి సుజాత మరియు ఉపాధ్యాయులు ప్రభుత్వం నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం చేశారు.

# వంతెన లేక బంద్ అయిన దారి...

## రెండు గ్రామాలకు తిప్పలు!



కరకగూడెం, ఆగష్టు 27(పీపుల్స్ డైరీ) : మండలంలోని కొత్తగూడెం నుండి కొమరం వారి గుంపు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో ఉన్న వర్రె గ్రామస్తుల పాలిట శాపంగా మారింది. ఈ వర్రె పై వంతెన లేకపోవడంతో ప్రస్తుతం వర్షాలకు వర్రె నీటితో నిండిపోవడంతో కొత్తగూడెం, కొమరం వారి గుంపు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా బంద్ అయ్యాయి. వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.దీంతో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ లు కూడా వెళ్లలేకపోతున్నాయి. గ్రామస్తులు ప్రమాదకరంగా నీటిలో నుండి నడుచుకుంటూ వెళ్తున్నారు. ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి శాశ్వతంగా వర్రె పై వంతెన నిర్మించి తమ ఇబ్బందులు తీర్చాలని వారు కోరుతున్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన కీర్తిరెడ్డి



చిట్యాల, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) : మండలంలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన సురేష్ -- రమ్యల వివాహ మహోత్సవానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తి రెడ్డి మరియు జయశంకర్ భూపాలపల్లి బీజేపీ జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిశిధర్ రెడ్డి గురువారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఆనందంగా సాగాలని వారు ఆకాంక్షించారు. వారి వెంట బిజెపి చిట్యాల మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్ ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్ సీనియర్ నాయకులు గజనాల రవీందర్ పెరుమాండ్ల రాజు వల్లాల ప్రవీణ్ కేంసారపు ప్రభాకర్ రాయిని శ్రీనివాస్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# రక్షాబంధన్ కావడంతో కిక్కిరిసిన కేసముద్రం పట్టణం

**రాఖీల కొనుగోలులో సందడి.. స్టాళ్ల వద్ద బారులు తీరిన మహిళలు**



కేసముద్రం ఆగస్టు 28 (పీపుల్స్ డైరి ) అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రక్షాబంధన్ పండుగ సమీపిస్తుండటంతో కేసముద్రం పట్టణం కిక్కిరిసిపోతోంది. పట్టణంలోని ప్రధాన రహదారులు, బస్టాండ్ సెంటర్, మార్కెట్ ఏరియాల్లో రాఖీల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పట్టణంలోని పలు చోట్ల రోడ్ల పక్కన రంగురంగుల శామియానాలు వేసి రాఖీలను విక్రయిస్తున్నారు. చిన్న పిల్లలకు నచ్చేలా కార్టూన్ రాఖీలు, లైటింగ్ రాఖీలు, రాళ్లు పొదిగిన డిజైనర్ రాఖీలు, సిల్వర్ రాఖీలు, సింపుల్ దారం రాఖీలు ఇలా రూ.10 నుండి రూ.200 వరకు అన్ని రకాల రాఖీలు అందుబాటులో ఉన్నాయి. తమ సోదరులకు ఇష్టమైన రాఖీ కొనాలని ఆడపడుచులు ఉత్సాహం చూపుతున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు రాఖీ స్టాళ్ల వద్ద మహిళలు, చిన్నారులు బారులు తీరుతున్నారు. రాఖీలతో పాటు స్వీట్లు, గిఫ్ట్ వస్తువులు, కొత్త బట్టల కొనుగోళ్లు కూడా పెరగడంతో వ్యాపారస్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రక్షాబంధన్ కానుకగా తమ తమ్ముళ్లకు, అన్నలకు రాఖీ కట్టేందుకు దూర ప్రాంతాల్లో ఉన్న సోదరీమణులు సైతం స్వగ్రామాలకు చేరుకుంటుండటంతో కేసముద్రం పట్టణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

# గిరిజన క్రీడలను ప్రారంభించిన డిప్యూటీ డైరెక్టర్ (డిడి)ఎం.ఫిరంగి

ఏన్కూర్,ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను బస్వాపురం గిరిజన బాలికల పాఠశాలలో డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఫిరంగి ప్రారంభించారు. అనంతరం జిల్లా క్రీడా అధికారి ఎన్.శంకర్రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ ఏం.ఫిరంగి మాట్లాడుతూ ఐటిడిఏ భద్రాచలం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగులు ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించి ఉపాధ్యాయుల్లోని క్రీడా నైపుణ్యాలను విద్యార్థులకు అందించడానికి పోటీలు దోహదం చేస్తాయని ఆయన తెలిపారు. ఐటీడిఏ స్థాయిలో కిన్నెరసాని క్రీడా పాఠశాలలో 29,30 తేదీలు జరగనున్నట్లు ఆయన తెలిపారు. క్రీడల్లో మంచి ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులకు నగదు ప్రోత్సాహకాలు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి. రాహుల్ ఐఏఎస్ ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ఈ క్రీడల్లో జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులు ఉద్యోగులు మొత్తం 60 మంది పాల్గొన్నారు. వాలీబాల్, క్రికెట్, షటిల్, క్యారమ్స్, చెస్, షార్ట్పిట్, విభాగాల్లో పోటీలు నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో వైరా ఖమ్మం ఏటీడీఓ పి. రమేష్,ఖమ్మం ఏసీఎంవో ఎల్.రాములు వివిధ పాఠశాలల హెచ్ఎంలు శ్రీనివాసరావు, పీడీలు వి. ప్రసాద్, బి.నెహ్రూ,బి. సక్రం, పిఈటిలు జె. రామారావు, బి.సుస్మిత, సతీష్, సీతారాం, శ్రీరామ్, శ్రీనివాస్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు డిఎస్. నాగేశ్వరరావు,బి.రాందాస్, ఎం.బాల్ సింగ్, బి.గోపీనాథ్, బి.భావచంద్, శంకర్, ఎస్. రమేష్, డి.సేన, శ్రీనివాసరావు, రాజేశ్వర్ రావు, సేన, చంద్రయ్య, శివ,అన్నపూర్ణ, తిరుమల,నిర్మల,తార, తదితరులు పాల్గొన్నారు.



## రాఖీలతో వెల్లివిరిసిన సోదరభావం

- విద్యార్థుల్లో సోదరభావం పెంపొందించేలా కార్యక్రమం
- ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవమే బంధానికి బలం
- పండుగల గొప్పతనాన్ని వివరించిన పాఠశాల నిర్వాహకులు
- రాఖీలు కట్టుకుంటూ సందడి చేసిన విద్యార్థులు
- ఫ్రోబెల్ లో ఘనంగా ముందస్తు రక్షాబంధన్ వేడుకలు





**గణపురం, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రంలోని ఫ్రోబెల్ మోడల్ హైస్కూల్‌లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రక్షాబంధన్ పండుగను పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బాలికలు బాలురకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఒకరికొకరు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎల్. కృష్ణ మాట్లాడుతూ... రక్షాబంధన్ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, అనుబంధం, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. పండుగల వెనుక ఉన్న గొప్ప సందేశాలను విద్యార్థులు తెలుసుకోవడంతో పాటు వాటిని తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు. ప్రేమ, బాధ్యత, పరస్పర గౌరవం, ఐక్యత, ఒకరినొకరు ఆదరించుకోవడం వంటి మంచి విలువలను అలవర్చుకోవాలని చెప్పారు. అనంతరం కరస్పాండెంట్ పి. శివశంకర్ మాట్లాడుతూ... విద్యార్థులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. సోదర, సోదరీమణుల మధ్య బంధం ప్రేమ, నమ్మకం, బాధ్యతలతో కూడుకున్నదని పేర్కొన్నారు. డైరెక్టర్లు ఎల్. యాదగిరి, ఎస్. జగన్ రెడ్డి కార్యక్రమానికి హాజరై విద్యార్థులను అభినందించారు. పండుగల ద్వారా పిల్లల్లో మానవతా విలువలు, సామాజిక బాధ్యత, సోదరభావం పెంపొందుతాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. బాలికలు తమ సహ విద్యార్థులకు రాఖీలు కడుతుండగా పాఠశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. విద్యార్థులు పరస్పరం ప్రేమ, ఆప్యాయత, గౌరవాలను పంచుకుంటూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రక్షాబంధన్ వేడుకలు విద్యార్థుల్లో ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవం వంటి విలువలను పెంపొందించేలా సాగాయి.

## హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు





**బోడుప్పల్:పీపుల్స్ డైరీ:** బోడుప్పల్‌లో నిర్వహించిన శ్రీ శ్రీ బంగారుమైసమ్మ అమ్మవారి బోనాల పండుగకు తమ ఆహ్వానాన్ని మన్నించి హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు బోడుప్పల్ బీఆర్ఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం హరీశ్‌రావును బోడుప్పల్ బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి,బంగారుమైసమ్మ అమ్మవారి బోనాల పండుగకు విచ్చేసి ఉత్సవాల్లో పాల్గొన్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ,బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి,మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి,బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొత్త చక్రపాణి గౌడ్,కొత్త రవి గౌడ్,బంధారం శ్రీధర్ గౌడ్,పులకండ్ల కీర్తన రెడ్డి,ఉప్పరి విజయ్,సామల మనోహర్ రెడ్డి,జడిగే మురళీకుమార్,సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## పారదర్శకంగా ఎస్ ఐ ఆర్ ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ

*18వ వార్డు మాజీ కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం*



**నర్సంపేట పీపుల్స్ డైరీ ఆగస్టు 27** నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ముగిసినందున.. వార్డు సభలో ఓటర్ జాబితాను ప్రజల ముందు చదివి ఁ వినిపించి వారి నుండి ఎలాంటి అభ్యంతరలను ఉన్నా తెలియజేయవలసిందిగా కోరడం జరిగింది..ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం మాట్లాడుతూ..నర్సంపేట అభివృద్ధి ప్రదాత, శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదేశానుసారం 18వ వార్డు లో ఎస్ ఐ ఆర్ ఓటర్ సవరణ ప్రక్రియ కార్యక్రమాన్ని పార్టీలకు అతీతంగా ఁ పకడ్బందీగా నిర్వహించడం జరిగింది అని అన్నారు..ఈ సవరణ కార్యక్రమంలో జిపిఓ బిఎల్ ఓ లు,కాంగ్రెస్ పార్టీ బిఎల్ ఎ లతో ప్రతి ఇంటింటికి తిరిగి.. ఓటర్ ఫారం వారికి అందజేసి..ప్రతి యొక్క ఓటును పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని..ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి కేవలం మరణించిన వారి ఓట్లు డబుల్ ఓట్లు ఁ ఎస్ హెచ్ ఐ ఎఫ్ టి డి ఓట్లు మాత్రమే తొలగించడం జరిగిందని అన్నారు..వార్డు సభలో ఓటర్ జాబితా ప్రచురించడం జరిగిందని..ఎలాంటి అభ్యంతరాలు రాలేదని తెలిపారు..18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం 6 ద్వారా కొత్త ఓటు నమోదు చేసుకోవచ్చని అన్నారు..18వ వార్డులో జరిగిన ఓటర్ సవరణ కార్యక్రమాన్ని దగ్గరుండి నడిపించిన జిపిఓ యాకాంబరం కి మరియు బి ఎల్ ఓ లు కొండి సునీత,రమాదేవి ,కాంగ్రెస్ పార్టీ బిఎల్ ఎ లు బిట్ల మనోహర్, బత్తుల శివకృష్ణ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు...ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ డైరెక్టర్ లక్కర్స్ రమేష్,వార్డు అధ్యక్షులు బిట్ల మనోహర్,వార్డు ప్రధాన కార్యదర్శి దేవోజు హేమంత్,వార్డు ఉపాధ్యక్షులు నకినబోయిన మహేష్,యూత్ అధ్యక్షులు బత్తుల శివకృష్ణ,యూత్ నాయకులు బొల్ల నవీన్,వరికెల నాగరాజు,వార్డు ముఖ్యులు కుందూరు వెంకటరెడ్డి,గోపాల నరేందర్,పొగాకు సాంబయ్య,మొగిలిచర్ల సాంబయ్య,ఆసం నాగన్న, చిలుముల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు..

## ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా వనమహోత్సవం



**ఆత్మకూర్, ఆగస్టు 27(పీపుల్స్ డైరీ):** తెలంగాణ వనమహోత్సవంలో భాగంగా ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ సంతోష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పరకాల ఏసీపీతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో కొబ్బరి, మామిడి, ఇతర పండ్ల మొక్కలు కలిపి సుమారు 100 మొక్కలను నాటారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు పచ్చదనంతో కళకళలాడేలా మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా ఏసిపి సతీష్ బాబు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కల పాత్ర ఎంతో కీలకమని అధికారులు పేర్కొన్నారు. మొక్కలు నాటడం ఒక్కటే కాకుండా వాటిని సంరక్షించి, భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు కూడా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. వనమహోత్సవం సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం పెంపొందించడంతో పాటు ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై స్ఫూర్తి కలిగించేలా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎస్ఐ తిరుపతి, ఎస్ఐ లక్ష్మీనారాయణ, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం...

- నియోజకవర్గ అభివృద్ధిలో పెద్ది సుదర్శన్ రెడ్డి పాత్ర మరువలేనిది...
- రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవ చేసిన గొప్ప మానవతావాది పెద్ది
- సంతాప సభలో పెద్ది సేవలను స్మరించుకున్న పలువురు వక్తలు.....





**నర్సంపేట పీపుల్స్ డైరీ ఆగస్టు 27 :** తెలంగాణ ఉద్యమకారుడు మాజీ శాసనసభ్యులు దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి సంతాప సభ బిఆర్ ఎస్ నర్సంపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిటిజెన్ క్లబ్ లో పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది....ఈ సందర్భంగా పాల్గొన్న బిఆర్ ఎస్ పట్టణ పార్టీ నాయకులు , వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, వ్యాపార, వాణిజ్య ,వర్తక ,కార్మిక విద్యార్థి మహిళా సంఘాలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులు మాట్లాడుతూ.....నర్సంపేట నియోజకవర్గం ప్రజల అభివృద్ధి కోసం పెద్ది సుదర్శన్ రెడ్డి అందించిన సేవలను స్మరించుకున్నారు.

పేద ప్రజల కోసం విద్యా, వైద్య కోసం జిల్లా ఆస్పత్రిని ,మెడికల్ కళాశాలను పల్లె దావకానలను, సైనిక పాఠశాల ,డిగ్రీ కళాశాల, నర్సింగ్ కళాశాల, సంక్షేమ గురుకులాలు నెలకొల్పి నియోజకవర్గ అభివృద్ధికి పాల్పడ్డారు...

వ్యవసారంగ అభివృద్ధి రైతుల కోసం శాశ్వత ప్రాజెక్టులు రామప్ప, రంగాయి ,పాకాల చెరువులు తో శాశ్వత నీటి పరిష్కారాన్ని అందించి నర్సంపేట ను సాగునీటి రంగంలో సస్యశ్యామలంగా చేశాడని కొనియాడారు....రాజకీయ కక్షలు లేకుండా నర్సంపేట నియోజకవర్గంలో శాంతిభద్రతలను కాపాడారు...ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర రైతు డైరెక్టర్ రాయిడి రవీందర్ రెడ్డి, బిఆర్ ఎస్ డివిజన్ మాజీ కోఆర్డినేటర్ తక్కలపెల్లి రవీందర్రావు,మాజీ ఎంపీపీ నల్ల మనోహర్ రెడ్డి, బిఆర్ ఎస్ డివిజన్ నాయకులు డాక్టర్.లెక్కల విద్యా సాగర్ రెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు నామాల సత్యనారాయణ బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, మాజీ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ నాడెం శాంతి కుమార్ పట్టణ కార్యదర్శి వేణుముద్దల శ్రీధర్ రెడ్డి, పట్టణ నాయకులు నాగిశెట్టి ప్రసాదు మండల శ్రీను, దోమ్మటి సంతోష్, బుస రాజు నవీన్ నాయక్ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు వాసం కరుణ, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు రాయిడి దుశాంత్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల రమేష్ జనసేన డివిజన్ ఇంచార్జి మెరుగు శివకోటి తెలంగాణ రక్షణ సేన డివిజన్ బాధ్యులు తడిగొప్పుల మల్లేశం, ఎల్ హెచ్ పి ఎస్ జాతీయ నాయకులు వాసు నాయక్, బీసీ సంఘాల నాయకులు సోల్తి సారయ్య కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు దాసరి నర్సింహారెడ్డి, ఐరన్ అండ్ హార్డ్వేర్ అసోసియేషన్ నాయకులు రాపర్తి అమర్నాథ్, అయ్యప్ప దేవాలయ అధ్యక్షుడు సైఫా సురేష్, ఆర్టి అసోసియేషన్ అధ్యక్షుడు కాసరబాధ రవి , రజక సంఘం పట్టణ అధ్యక్షుడు కొల్లూరి లక్ష్మీనారాయణ మేదర సంఘం డివిజన్ అధ్యక్షుడు షేర్ల శ్రీనివాస్, సీనియర్ సిటిజన్స్ వడ్లకొండ సాంబయ్య, మాజీ ఎంపీపీ కళావతి పార్టీ కౌన్సిలర్లు మాజీ కౌన్సిలర్లు వార్డు బాధ్యులు క్లస్టర్ బాధ్యులు మహిళా సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు....

## ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నూతన కమిటీ ఎన్నిక

**సెప్టెంబరు 9న చలో వరంగల్‌ను విజయవంతం చేయాలి**



గణపురం, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ): గణపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గురువారం ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల ఇన్‌చార్జి నోముల శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మడిపల్లి శ్యాంబాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి రాష్ట్ర నాయకులు అంబాల చంద్రమౌళి మాదిగ హాజరై మాట్లాడారు. సెప్టెంబరు 9న వరంగల్‌లో జరిగే జాతీయ మహాసభను విజయవంతం చేయాలని, సామాజిక, ఆర్థిక అసమానతల నిర్మూలనకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా దొమ్మటి రాకేష్ మాదిగ, అధికార ప్రతినిధిగా జన్ను పవన్ కళ్యాణ్, ప్రధాన కార్యదర్శిగా కొలువురి విష్ణు మాదిగ, ఎంఎస్పి అధ్యక్షుడిగా మాస్ నాగరాజు మాదిగ, అధికార ప్రతినిధిగా కుక్కమూడి కుమార్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా జన్ను ప్రశాంత్ మాదిగలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా సీనియర్ నాయకులు బొల్లి బాబు మాదిగ, రేణిగుంట్ల కొమరయ్య మాదిగ, కో ఇన్చార్జి ఎర్ర భద్రయ్య మాదిగ, గాజుల బిక్షపతి మాదిగ, దోర్నాల రాజేందర్ మాదిగ, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాలలో మాదిగలు ముందుండాలి

**డాక్టర్ నరసింహరావు మాదిగ, ఎమ్మార్పిఎస్ జాతీయ అధ్యక్షుడు**



చెన్నూరు ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) : విద్యా, ఉద్యోగం రాజకీయం వంటి అన్ని రంగాలలో మాదిగలు ముందుండాలని ఎమ్మార్పిఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నరసింహ రావు పిలుపునిచ్చారు. గురువారం రోజున ఎమ్మార్పిఎస్ చెన్నూరు నియోజకవర్గ ఇంచార్జ్ పొన్నాల మల్లేష్ ఆధ్వర్యంలో చెన్నూరు పట్టణ కేంద్రంలో ఎమ్మార్పిఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దళితుల ఆరాధ్య దైవం అంబేద్కర్ రాసిన రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకుంటూ మాదిగల సంక్షేమమే లక్ష్యంగా ప్రతీ ఒక్క మాదిగ బిడ్డ పోరు బాటలో నడవాలన్నారు. నేడు పేరుకే మాదిగలకు ప్రభుత్వ ఫలాలు అందిస్తున్నట్లు ప్రకటిస్తూ, మాదిగలను ప్రభుత్వం మోసం చేస్తుందని, హక్కుల సాధనలో మాదిగలు తమ వెనక నడవాలని నరసింహ రావు కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దాసరి వీరమణి మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కలగూర తిరుపతి, జిల్లా అధ్యక్షులు ఆకుదారి రాజబాపు, మండలాధ్యక్షుడు పొన్నాల ప్రదీప్ మాదిగ, అటకపురం సతీష్ మాదిగ, గజ్జెల రమేష్, కాసిపేట లచ్చన్న, కాసిపేట రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ తల్లి దేవాలయం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



**దుగ్గొండి పీపుల్స్ డైరీ ఆగస్టు 27 :** తిమ్మంపేట గ్రామంలో ఆగస్ట్ 28,29,30 తేదీలలో దాతల ద్వారా నిర్మించుకున్న పోచమ్మ తల్లి గుడి కాంపౌండ్ ప్రారంభోత్సవానికి నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి ని ఆహ్వానించిన దేవాలయ నిర్మాణ నిర్వహణ కమిటీ

తిమ్మంపేట గ్రామంలోనీ, కోమండ్ల స్వరూప సూరారెడ్డి, బోదె అరుణాదేవి ప్రభాకర్ రెడ్డి దాతల సహకారంతో మన గ్రామ పోచమ్మ దేవాలయం నూతనంగా నిర్మించడం జరిగినది. కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం బోదె రజిత కరుణాకర్ రెడ్డి ఒక్క లక్ష యాభై వేల రూపాయలు, పాలడుగుల ప్రసన్న భరద్వాజ్ ఒక్క లక్ష రూపాయలు, దండు మౌనిక రవీందర్ 50వేల 116 లు, తోటకూరి సులోచన రమేష్ 20వేల రూపాయలు, ఈదుల అశోక్ గారు 11,500 పల్లకొండ రజిత రాజు 30 గజాలు,పావుగుంట భూమి, బొమ్మినేని నాగరాణి నారాయణరెడ్డి కాంపౌండ్ వాల్ కు గేటు తయారు చేయించి అందించటం జరిగినది. అలాగే పోతరాజు విగ్రహ దాతగా మన గ్రామానికి చెందిన బక్క తట్ల శోభ వక్కతట్ల అరవింద్ ముందుకు వచ్చినందుకు వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.అలాగే పై దాతలు అందించిన సహకారంతో కాంపౌండ్ వాల్ పూర్తి కానందున సుమారుగా మూడున్నర లక్షల రూపాయలు అప్పు తీసుకువచ్చి కాంపౌండ్ వాల్ ను పూర్తి చేయడం జరిగినది. అలాగే గ్రామంలోని వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ కోసం సహకరించిన,సహకరిస్తున్న పెద్దలు ప్రజలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేయడం జరిగినది.నూతనంగా గ్రామంలో నిర్మించుకున్న పోచమ్మ తల్లి దేవాలయం ప్రారంభోత్సవానికి నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ని ఆహ్వానించడం జరిగింది.ఈ దేవాలయ ప్రారంభోత్సవానికి పిలవగానే వస్తానని మాట ఇచ్చిన నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి కి దేవాలయ నిర్వాహన కమిటీ తరపున ధన్యవాదాలు తెలుపుచున్నాము. కావున పోచమ్మ తల్లి దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి గ్రామ ప్రజలందరూ హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరడం జరిగింది,

నర్సంపేట శాసనసభ్యులు దొంతి ధవరెడ్డి ని ఆహ్వానించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోడం శ్రీలత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొనగాని ఆగయ్య, దేవాలయ నిర్మాణ నిర్వహణ కమిటీ కార్యదర్శి అశోక్ భూమ, కమిటీ సభ్యులు పాలడుగుల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ఏఐకేఎంఎస్ 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**- మహాసభల పోస్టర్లు ఆవిష్కరించిన నాయకులు**




**మట్టెవాడ, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ):** అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) 9వ రాష్ట్ర మహాసభలు మంచిర్యాల జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 8,9 తేదీలలో జరుగుతాయని సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు తెలిపారు. గురువారం ఖిలావరంగల్ పంపు సెంటర్ వై-జంక్షన్ లో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ మహాసభల మొదటి రోజు సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి అధ్యక్షతన జరుగుతుందని ప్రముఖ సంపాదకులు విమర్శకులు, రచయిత కె.శ్రీనివాస్ ప్రారంభ ఉపన్యాసం ఇస్తారని ముఖ్యఅతిథిగా ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య హాజరవుతారని వక్తలుగా జాతీయ ఉపాధ్యక్షులు రమేందర్ సింగ్, పటియాల జీవి చలపతిరావు, ఐఎఫ్.టియూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, సహాయ కార్యదర్శి అజ్మీరా లాల్ కుమార్ లు ప్రసంగిస్తారని ఆయన తెలిపారు. రెండవ రోజు సంస్థాగత రిపోర్టు రివ్యూ నిర్మాణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని రైతు కూలీలను బాలరాజు కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి, కోశాధికారి బండి వెంకటేశ్వర్లు, ఇనుముల కృష్ణ, బండి కుమార్, సుద్దాల వీరయ్య, ఎండి.అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి భూమి పూజకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

**గణపురం, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) :** ఈ నెల 31న సోమవారం నిర్వహించనున్న శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ భూమి పూజ కార్యక్రమానికి హాజరుకావాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును ఆలయ కమిటీ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను అందజేసి ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆకుల సుభాష్ ముదిరాజ్ మాట్లాడుతూ... భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూజారి రాజేందర్, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు ఆకుల రాజయ్య, కమిటీ ఉపాధ్యక్షుడు సాదు కరుణాకర్, ప్రధాన కార్యదర్శి ఆకుల కృష్ణస్వామి, కుల పెద్దలు ఆకుల రవీందర్, కమిటీ సభ్యుడు ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## పాలకుర్తిలో 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పీపుల్స్ డైరీ, వరంగల్ క్రైం : అక్రమంగా తరలిస్తున్న సుమారు 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పాలకుర్తి పోలీసులు పట్టుకున్నారు. గురువారం తెల్లవారుజామున నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా వెళు_న్న రెండు వాహనాలను తనిఖీ చేయగా భారీగా పీడీఎస్ బియ్యం బయటపడింది. TS07UN5612 నంబర్ గల అశోక్ లేలాండ్ వాహనంలో సుమారు 30 క్వింటాళ్లు, TS 08 UB9032 నంబర్ గల మరో వాహనంలో సుమారు 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వాహనాలను స్వాధీనం చేసుకుని డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో గ్రామస్థుల నుంచి పీడీఎస్ బియ్యాన్ని సేకరించి తరలిస్తున్నట్లు డ్రైవర్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంపై పాలకుర్తి పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**మొగుళ్లపల్లి ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ):** మండలంలోని వివిధ గ్రామాలలో భూపాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు గురువారం పర్యటించి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి, వివో భవనాలకు శంకుస్థాపన చేసారు. మొగుళ్ళపల్లి గ్రామంలోని రైతు వేదికలో ఎమ్మెల్యే స్మార్ట్ రేషన్ కార్డులను లంచానంగా పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నూతన స్మార్ట్ రేషన్ కార్డులను ప్రతిష్టాత్మకంగా రూపొందించి ప్రజలకు అందించడం జరుగుతుందని. 15ఏళ్లుగా గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా పంపిణి చేయకుండా అసమర్ధ పాలన కొనసాగించారని, రేషన్ కార్డులో కొత్తగా ఒక్కరి పేరు చేర్చకుండా పూర్తిగా విఫలంమైందని, రేషన్ షాపుల వద్ద వేలిముద్రలు రాకపోవడంతో. రేషన్ కోసం ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కునేవారని. రేషన్ తీసుకోవడంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితో ప్రతి ఇంటికి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయడమే కాకుండా. ఒక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందిస్తున్న ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వమని ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందాలని లక్ష్యంతో. ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని. రాష్ట్రంలో ఆరు లక్షలకు పైగా నూతన రేషన్ కార్డులను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. మహిళ సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు అవసరమైన సహకారం మహిళలకు అందిస్తామని అన్నారు. మొరంచపల్లి నుండి మొగుళ్లపల్లి మీదుగా ఇల్లంతకుంట వరకు, పరకాల నుండి మొగుళ్లపల్లి వరకు, రేగొండ నుండి చిట్యాల వరకు, రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం అంతేకాకుండా రంగాపురం చలివాగుపై వంతెన నిర్మాణం చేపట్టి నియోజకవర్గాన్ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు12 కోట్లతో ఎమ్మారై ఏర్పాటు చేసి ప్రభుత్వ వైద్య సేవలను అందిస్తున్నామని స్వార్థ రాజకీయాలతో కొందరు ఎమ్మారై స్కానింగ్ పనిచేయడం లేదని అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని ఈరోజు పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు చేసి ఎమ్మారై స్కానింగ్ తీయించుకోలేని పేద ప్రజలు భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో డబ్బులు లేకుండా ఎంతోమంది నిరుపేదలు ఉచితంగా ఎంఆర్ఐ స్కానింగ్ తీయించుకుంటున్నారని పనికిమాలిన వాళ్ళు పనిచేయడం లేదని చెప్పడం హాస్యాస్పదమని రాష్ట్రంలో 14 వేల కోట్ల అదనపు భారం పడుతున్న ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని సన్న బియ్యం అమ్మినట్లయితే వారికి స్మార్ట్ రేషన్ కార్డు అవసరం లేదని, వారి స్మార్ట్ రేషన్ కార్డు తక్షణమే రద్దు చేయడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ స్మార్ట్ రేషన్ కార్డును ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాట్ల విజయ రవీందర్, తాహసిల్దార్ జాలి సునీత, ఎంపీడీవో సురేందర్, ఆర్ ఐ శివరామకృష్ణ, ఎంపీఓ సుభాష్ చంద్రబోస్, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, ఏఎంసి వైస్ చైర్మన్ మహమ్మద్ రఫీ, తక్కలపల్లి రాజు, క్యాతరాజు రమేష్, బండి సుదర్శన్ గౌడ్, దండే వెంకటేశ్వర్ రెడ్డి, పోలినేని లింగారావు, అన్ని గ్రామాల సర్పంచులు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## ఏఐటియూసి రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయండి




**మట్టెవాడ, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ):** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ విమర్శించారు. గురువారం సికెఎం ఆసుపత్రిలోని కార్మికులతో కలిసి ఏఐటియూసి రాష్ట్ర 4వ మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా గన్నారపు రమేష్ మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న ఏఐటియూసి ఆవిర్భవించిందని, నాటి నుంచి నేటి వరకు కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి 44 కార్మిక చట్టాలను సాధించిం దన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజ నాల కోసమే 'వ్యాపారం సులభతరం' పేరుతో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆరో పించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, 8గంటల పని విధానాన్ని కొనసాగించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు కరీంనగర్‌లో ఏఐటియూసి రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు దడిగెల సంధ్యారాణి, జిల్లా కార్యవర్గ సభ్యులు కలకోట్ల రాజు, జిల్లా సమితి సభ్యులు లావణ్య, సికెఎం హాస్పిటల్ కార్యదర్శి నాగవల్లి శంకర్, సక్కుబాయి సులోచన, దేవేందర్, కొమ్మాలు, సుజాత, కవిత, అహల్య, రాము, సుభాసిణి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో రాఖీ సంబరాలు..

మట్టెవాడ, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ): వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం ఆధ్వర్యంలో గురువారం రాఖీ సంబరాలు జరుపుకున్నారు. మహిళా విభాగం కార్యదర్శి గార్లపాటి శ్రీలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు దుబ్బ శ్రీనివాస్ అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుండి ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ రక్షాబంధన్ సోదర సోదరీ మణులను రక్షించుకునే విధంగా ఏర్పాటు అయిందన్నారు. రక్షాబంధన్ ద్వారా మేము తప్పక మీకు అండదండగా ఉంటామని మీరు మేము కలిసి ఈ దేశ రక్షణకు ఉందామని మన సాంప్రదాయాన్ని మన పిల్లలకు కూడా తీసుకెళ్లాలని ఆ సంబంధాల్ని బలపరుచుకునే విధంగా రక్త బంధాన్ని పెంచుకునే విధంగా ఉండాలని వారు కోరుతూ జిల్లాలో ఉండే ప్రజలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ రక్షాబంధన్ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి. తాటిపెల్లి రాజమణి, అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ తాటిపెల్లి సుప్రియ ఆర్గనైజింగ్ సెక్రటరీ గోరంట్ల సంపూర్ణ, ఉపాధ్యక్షురాలు గీత, రజిత, శిరీష, వనజ, రాజమణి తదితర మహిళలు పాల్గొని మహాసభ జిల్లా అధ్యక్షులు దుబ్బ శ్రీనివాస్, ఓలం సదాశివుడు, యాద రవికుమార్, సోమా అశోక్, సుద్దాల రమేష్, పుల్లూరు రఘు, మురళి, రాజు, మూర్తి, సుధాకర్, వీరేందర్, శ్యాంబాబు, సుజాత, రమ, స్రవంతి, స్వరూపతో పాటు 100 మంది పాల్గొని రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించుకున్నారు.



# ఫీజుల బకాయిలపై బిజెవైఎం లడాయి

వరంగల్‌లో సిఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



**మట్టెవాడ, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ):** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల అవలంభిస్తున్న నిరంకుశ వైఖరిని నిరసిస్తూ భారతీయ జనతా యువమోర్చా వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం కాశిబుగ్గ జంక్షన్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 40 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన 15,000 కోట్లు ఫీజు రీఇంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.

నిరంకుశ పాలన సాగిస్తూ విద్యా వ్యవస్థను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. బకాయిలు అందక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, పెండింగ్‌లో ఉన్న 40 లక్షల మంది విద్యార్థుల ఫీజుల బకాయిలను రేవంత్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని గంట రవి, ప్రదీప్ రావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల శ్రవణ్, ఆడెపు రవిరామ్, మున్నా, మహంత్, అభి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, నాయకులు అంకాల జనార్ధన్, ఇనుముల అరుణ్, విప్ప సుధాకర్, బిజెవైఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ లో ఘనంగా రాఖీ వేడుకలు

కుటుంబ సభ్యులతో కలిసి రాఖీ పండుగ జరుపుకున్న కేసముద్రం పోలీసులు





**కేసముద్రం ఆగస్టు 27 (పీపుల్స్ డైరి )** అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను కేసముద్రం పోలీస్ స్టేషన్ లో ఘనంగా జరుపుకున్నారు. పోలీస్ స్టేషన్ ను తమ కుటుంబంగా భావిస్తూ, కుటుంబ సభ్యులతో కలిసి రాఖీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసు సిబ్బంది, పోలీస్ కుటుంబాలకు చెందిన మహిళలు పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఒకరికొకరు రాఖీలు కట్టుకొని, మిఠాయిలు పంచుకుంటూ వేడుకను ఆనందంగా జరుపుకున్నారు.పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలో స్టేషన్ సిబ్బంది అందరూ పాల్గొన్నారు. విధి నిర్వహణలో ఎల్లప్పుడూ బిజీగా ఉండే పోలీసులకు ఈ వేడుక ఎంతో ఉత్సాహాన్ని, కుటుంబ వాతావరణాన్ని తీసుకువచ్చింది.

రాఖీ పండుగ కేవలం కుటుంబానికే పరిమితం కాదని, విధి నిర్వహణలో తోడుగా ఉండే తోటి సిబ్బందితో కూడా అన్నా చెల్లెళ్ల అనుబంధాన్ని చాటుకోవచ్చని ఈ వేడుక ద్వారా కేసముద్రం పోలీసులు నిరూపించారు.ఈ కార్యక్రమంలో కేసముద్రం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మచ్చ కుమార స్వామి రోడ్డు ప్రమాదంలో అకాల మృతి

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన సంఘాలు





**వరంగల్ ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ నగరంలోని రంగ సాయిపేట ప్రాంతానికి చెందిన శ్రీరామ ట్రాలీ యూనియన్ రంగ సాయిపేట యూనియన్ అధ్యక్షుడు మచ్చ కుమార స్వామి రోడ్డు ప్రమాదంలో అకాల మృతి చెందారు. వారి మృతి పట్ల రంగసాయిపేటలోని మిత్ర పరపతి సంఘం అధ్యక్షులు చిగిరి కుమారస్వామి ప్రధాన కార్యదర్శి ఏలుగు సాంబేషం కోశాధికారులు రావుల నవీన్ నంద రమేష్ ఉపాధ్యక్షులు శంకేసి వెంకటేశ్వర్లు శాశ్వత సభ్యులు రావుల బాలరాజు బక్కి వీరసాయి ప్రసాద్ బొలిశెట్టి కమలాకర్ ఆకుతోట రాజు కుమార్ కార్యవర్గ సభ్యులు బక్కి శ్రీధర్ దామర కొండ నిరంజన్ మండల నరసింహా రాములు మండల చిరంజీవి గూడురు తిరుపతి రెడ్డి జక్కం దామోదర్ నాలబోల విష్ణు జనతా పరపతి సంఘం ఉపాధ్యక్షులు పెరుమాండ్ల రమేష్ శాశ్వత సభ్యులు చీకటి పెద్ద సమ్మయ్య టీవీ రఘురాం విలాసాగరం శ్రీధర్ తోట మహేందర్ వివిధ సంఘ ప్రతినిధులు హాజరై ఆర్థిక సాయం అందించారు రంగసాయిపేట ట్రాలీ యూనియన్ గౌరవ అధ్యక్షులు గూడూరు తిరుపతిరెడ్డి ప్రధాన కార్యదర్శి ఎలగాల మహేందర్ మజ్జిగ జగన్ ఇమ్మడిశెట్టి కిషన్ జైపాల్ అక్బర్ పాల్గొన్నారు మాజీ కార్పొరేటర్ గుండు చందనా పూర్ణచందర్ కెడల పద్మ జనార్ధన్ కెడల చంద్రశేఖర్ రజక కుల సంఘ పెద్దలు కులస్తులు వివిధ సంఘాల నాయకులు వివిధ కులస్తులు వేల సంఖ్యలో హాజరై వారి మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి మనో ధైర్యాన్ని పెంపొందించారు రంగసాయిపేట స్థానిక వైద్య నిపుణుడు డాక్టర్ బి సాంబమూర్తి, రావుల నరేష్ గంద్రతి కుమార్ జీకే మండల సురేష్ తోటరాజు కత్తెరపల్లి వేణు కత్తెర పెల్లి నవీన్ మునుకుంట్ల శ్యామ్ నాగపురి శ్రీనాథ్, సంతోష్ రాజ సమ్మయ్య బూర సంతోష్ కోక సత్యనారాయణ విచ్చేసి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆర్టీవో ఆఫీస్ సమీపంలో గల లెనిన్ నగర్ లోని వారి నివాసం నుండి అంతిమయాత్ర కొనసాగుతూ రంగసాయిపేట గౌచర్ల జంక్షన్, మహంకాళి, బొడ్రాయి సెంటర్, రజక, యాదవ్ నగర్ నుండి బైపాస్ రోడ్డు దగ్గర రజక స్మశాన వాటికలో కుమారస్వామి అంతక్రియలు జరిగాయి..

## ఎరువుల పంపిణీలో నూతన విధానం



**కేసముద్రం ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) :** రైతులకు ఎరువులు పారదర్శకంగా, అవసరానికి అనుగుణంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎరువుల విక్రయానికి సంబంధించిన నూతన డిజిటల్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ఇకపై మండలంలో ఎరువుల పంపిణీ పూర్తిగా ఈ కొత్త యాప్ ద్వారానే జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి కేసముద్రం బి వెంకన్న తెలిపారు. ఇకపై రైతులు తమ సాగు అవసరాలకు అనుగుణంగా ముందుగానే యాప్‌లో నమోదు చేసుకుని ఎరువులను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. రైతు వివరాలు, సాగు భూమి, పంట వివరాలు, అవసరమైన ఎరువుల సమాచారం ఆధారంగా పంపిణీ జరుగుతుందన్నారు. కేసముద్రం మండలంలోని రైతులు ఎరువుల అవసరం వచ్చిన తర్వాత కాకుండా ముందుగానే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని నమోదు పూర్తి చేసుకోవాలి. రైతు గుర్తింపు సంఖ్య, ఆధార్, సెల్ నంబర్, భూమి వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలి. యాప్ వినియోగంలో సందేహాలు లేదా ఇబ్బందులు ఎదురైతే గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి లేదా ఎరువుల విక్రయ కేంద్రాలను సంప్రదించాలి. మహబూబాబాద్ జిల్లాలో ఈ యాప్ సెప్టెంబర్ మొదటి వారంలో మొదలవుతుందన్నారు.

## గీసుగొండలో నగదు చోరీ.. నిందితుడి అరెస్ట్...




**పీపుల్స్ డైరీ, వరంగల్ క్రైం :** జాన్‌పాక్‌లోని పెట్రోల్ బంక్ వద్ద డీసీఎం వాహనంలో నుంచి రూ.1.50 లక్షల నగదు చోరీ చేసిన కేసులో గీసుగొండ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.20,000 నగదు, శామ్ సంగ్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గొర్రెకుంటకు చెందిన తాంటికంటి భాస్కర్ బెల్ బ్రాండ్ కంపెనీలో సేల్స్‌మ్యాన్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 21న డ్రైవర్ కుళ్ల సునీల్, హెల్పర్ యాద గణేష్‌తో కలిసి డీసీఎం వాహనంలో స్వీట్లు, బేకరీ ఉత్పత్తుల విక్రయాల కోసం విజయవాడ, మచిలీపట్నం ప్రాంతాలకు వెళ్లారు. విక్రయాల అనంతరం కలెక్షన్ నగదుతో తిరిగి వస్తుండగా 23న సాయంత్రం జాన్‌పాక్‌లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద డీజిల్ కోసం వాహనాన్ని నిలిపారు. భాస్కర్ నగదు ఉన్న బ్యాగ్‌కు తాళం వేసి సీటు వెనుక ఉంచి బిల్లు తీసుకునేందుకు కిందకు దిగారు. ఆ సమయంలో హెల్పర్ గణేష్ క్యాబిన్‌లోనే ఉన్నాడు. బిల్లు తీసుకుని తిరిగి వచ్చే సరికి గణేష్ కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన భాస్కర్ నగదు బ్యాగ్‌ను పరిశీలించారు. బ్యాగ్ కిందివైపు కోసి ఉండటాన్ని గుర్తించారు. అందులోని రూ.1.50 లక్షల నగదు కనిపించకపోవడంతో గణేష్‌పై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గీసుగొండ పోలీసులు దర్యాప్తు చేపట్టి యాద గణేష్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ.20,000 నగదు, ఒక శామ్‌సంగ్ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికి గతంలోనూ ఓ దొంగతనం కేసులో ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

## వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం..

### వృద్ధుడు మృతి..



**పీపుల్స్ డైరీ, వరంగల్ క్రైం :** గీసుగొండ మండలం దస్రు తండా--కొమ్మాల గ్రామ స్టేజీ మధ్య వరంగల్--నర్సంపేట ప్రధాన రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. సంగెం మండలం వంజరపల్లి గ్రామానికి చెందిన గోనె సమ్మయ్య (70) వ్యవసాయ పనిముట్ల వెల్డింగ్ పని కోసం తన టీవీఎస్ ఎక్స్ఎల్ వాహనంపై కొమాల వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం సుమారు 3.30 గంటల సమయంలో నర్సంపేట వైపు నుంచి వరంగల్ వైపు వస్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు అతడి వాహనాన్ని ఎదురుగా ఢీకొట్టింది. కారు డ్రైవర్ వనంప్రమోద్ కుమార్ అతివేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఢీకొన్న అనంతరం సమ్మయ్యను కొంత దూరం వరకు కారు ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో సమ్మయ్య తలకు బలమైన గాయం కావడంతో పాటు ముఖం, ఛాతీ, ఎడమ తొడ, ఎడమ చేయి, కుడి చేయిపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయన సంఘటనా స్థలంలోనే మృచెందాడు. మృతుడి భార్య గోనె సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ వనంప్రమోద్ కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు గీసుగొండ ఇన్‌స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ తి తెలిపారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

### సర్పంచ్ చాట్ల విజయ రవీందర్




**మొగుళ్ళపల్లి ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) :** విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని సర్పంచి చాట్ల విజయ రవీందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి లింగాల కుమారస్వామితో కలిసి మండలంలోని వివిధ పాఠశాలలకు బూట్లు, సాక్సులు, తదితర విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా కిట్లు, యూనిఫాంలు, బూట్లు వంటి సౌకర్యాలు విద్యార్థుల చదువుకు మరింత ప్రోత్సాహాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు.

విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, కృష్ణారెడ్డి, మహేష్, రాము, నసిరుద్దీన్, ఎం ఆర్ సి సిబ్బంది వేణు, చంద్రమౌళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా ఉడుత నాగరాజు యాదవ్

గణపురం, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షులుగా మండలంలోని పరశురాంపల్లి గ్రామానికి చెందిన ఉడుత నాగరాజు యాదవ్ ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్ ప్రకటన విడుదల చేశారు. ఉడుత నాగరాజు యాదవ్ గతంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ లలో వివిధ బాధ్యతలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉడుత నాగరాజు యాదవ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జి చందుపట్ల కీర్తి రెడ్డి, జిల్లా అధ్యక్షులు నిషిధర్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు యుగంధర్, పాపయ్య, గణపతి, శశికుమార్ లతో పాటు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# పీపుల్స్‌డైరీ

వరంగల్

శుక్రవారం, 28 ఆగస్టు 2026

సంపుటి : 18, సంచిక : 166




## ముదిగొండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) :** ముదిగొండ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ స్టేషన్ నిర్వహణ, స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, సిబ్బంది పనితీరును పరిశీలించిన కమిషనర్, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నేర నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా సెక్టర్ అధికారులు, పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, సిఐ మురళి పాల్గొన్నారు.

## దివ్యాంగ బాల బాలికలకు మండల స్థాయి క్రీడా పోటీలు



**కరకగూడెం, ఆగస్టు 27(పీపుల్స్ డైరీ) :** కరకగూడెం మండలంలోని జెడ్పీహెచ్ఎస్ భవిత పాఠశాలలో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న దివ్యాంగ బాల బాలికలకు మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయురాలు ఐఈఆర్టీ జి. విజయకుమారి ఆధ్వర్యంలో ఈ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ గడ్డం. మంజుల హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగ బాల బాలికలు చదువుతో పాటు క్రీడలు, ఇతర అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. వారికి ప్రోత్సాహం అందిస్తే మరింత ప్రతిభను కనబరుస్తారని తెలిపారు. కరకగూడెం పోలేబోయిన సర్పంచ్ సుజాత కార్యక్రమానికి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కుర్చీ ఆట, పరుగు పందెం, స్పూన్ రేస్ తదితర క్రీడా పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ క్రీడా విభాగాల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో భట్టుపల్లి పాఠశాల హెడ్‌మాస్టర్ మోహన్‌బాబు, కరకగూడెం ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిఆర్పి సాంబశివరావు ప్రత్యేక విద్యా సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించిన శ్రీ వివేకవర్ధిని హైస్కూల్



**కేసముద్రం ఆగస్టు 27 (పీపుల్స్ డైరి )** మండలం మహమూద్ పట్నం శివారులోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో గురువారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు రాఖీలు కట్టి ఆశీస్సులు పొందారు. గురు–శిష్యుల మధ్య ఉన్న ఆప్యాయత, గౌరవ భావాలను ప్రతిబింబించేలా కార్యక్రమం సాగింది. రక్షాబంధన్ పండుగ సందర్భంగా పాఠశాల యాజమాన్యం వినూత్నంగా "వృక్షాబంధన్" కార్యక్రమాన్ని నిర్వహించింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పాఠశాల ఆవరణలోని వృక్షాలకు రాఖీలు కట్టి ప్రకృతి పరిరక్షణకు తమ బాధ్యతను చాటారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో పలు మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ, "రక్షాబంధన్ అనేది కేవలం అన్నాచెల్లెళ్ల అనుబంధానికి మాత్రమే పరిమితమైన పండుగ కాదు. ప్రేమ, విశ్వాసం, బాధ్యత, రక్షణ అనే విలువలను సమాజానికి గుర్తు చేసే మహత్తరమైన సంస్కృతి. మనలను కాపాడే ప్రకృతిని, వృక్షాలను కూడా సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అందుకే రక్షాబంధన్‌ను వృక్షాబంధన్‌తో అనుసంధానం చేసి విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ భావనను పెంపొందిస్తున్నాం. నేటి విద్యార్థులే రేపటి పర్యావరణ రక్షకులుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నాం" అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ చిర్ర నరేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని రక్షాబంధన్ పండుగ విశిష్టతను చాటిచెప్పారు.

## రాఖీలతో సోదరభావం వెల్లివిరిసింది

### పీఎం శ్రీ ఆదర్శ మోడల్ పాఠశాలలో రాఖీ వేడుకలు



**గణపురం, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రంలోని పీఎం శ్రీ ఆదర్శ మోడల్ పాఠశాలలో ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘం, ఎస్సీ, ఎస్టీ, బీసీ బహుజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థుల మధ్య సోదరభావాన్ని పెంపొందించేలా రాఖీలు కట్టించారు. విద్యార్థినులు తమ తోటి విద్యార్థులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాఖీ పండుగ విశిష్టతను నిర్వాహకులు వివరించారు. సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవం పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్, రజక సంఘం జిల్లా యూత్ అధ్యక్షులు పసునూటి శంకర్, మైనార్టీ మండల నాయకులు ఎండి సైదులు పాషా, ఎండి బహదూర్ ఖాన్, బహుజన సంఘాల నాయకులు, ఇన్చార్జి ప్రిన్సిపాల్ రజిత, పిటి మమత,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కుటుంబానికి ఆసరాగా నిలిచిన 2006 టెన్త్ బ్యాచ్



**చిట్యాల, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన మారపల్లి భద్రమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. గురువారం జరిగిన ఆమె దశదినకర్మ సందర్భంగా కుటుంబ సభ్యులను చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006 పదో తరగతి బ్యాచ్ బాల్యమిత్రులు తమ స్నేహాన్ని చాటుకున్నారు. మృతురాలి కుమారుడు మారెపల్లి సాంబయ్యతో కలిసి పదో తరగతి విద్యను అభ్యసించిన బాల్యమిత్రులు పరామర్శించి కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం మిత్రులంతా కలిసి జమ చేసిన రూ.25 వేల నగదును సాంబయ్య కుటుంబానికి ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని బాల్యమిత్రులు భరోసా ఇచ్చారు. కష్టకాలంలో స్నేహితుల కుటుంబాలకు 14వ సారి అండగా నిలిచినా 2006 పదో తరగతి బ్యాచ్ మిత్రులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మిత్రులు చింతల మహేందర్ మురారి భానుచందర్ పోతారపు మహేష్ కలికోట లక్ష్మణ్ కటుకూరి కుమార్ పాశిగంటి మహేందర్ ఉయ్యాల రమేష్ చిలుముల రాజేష్ గుండ తిరుపతి దూడపాక రాజేందర్ కప్పల రాజేష్ రేణిగుంట్ల రమాకాంత్ నేరెళ్ల సురేష్ సిలివేరి రవీందర్ గుర్రం రాజేందర్ బూడిద రవి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

**పీపుల్స్ డైరీ, వరంగల్ క్రైం :** ఈ నెల 23న దంతలపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడగా దంతాలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రవికుమార్ కేసు చేశారు తూర్పు తండకు చెందిన ముడావత్ దుబ్ల తన బంధువు బైక్ పై వెళ్తుండగా, కుమ్మరికుంట్ల చాందిన యువకుడు బైక్‌తో ఎదురుగా వచ్చి ఢీకొట్టాగా ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుబ్ల ప్రస్తుతం సాయి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడి భార్య సాంకూ ఫిర్యాదు మేరకు నిందితుడు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రవికుమార్ ప్రకటనలో తెలిపారు.

# అర్హులైన ప్రతి ఓటరుకు హక్కు కల్పిస్తాం

**ఎస్ఐఆర్‌పై ప్రత్యేక గ్రామసభలో కలెక్టర్ రాహుల్ శర్మ**





**గణపురం, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) :** అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు ఉండేలా, అనర్హమైన, వాస్తవంగా లేని ఓట్లను తొలగించి పారదర్శకమైన తుది ఓటర్ల జాబితా రూపొందించడమే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం గణపురం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన సర్ ప్రత్యేక గ్రామసభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, సర్ ప్రక్రియ, డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో గుర్తించిన అనామలీస్, నో మ్యాపింగ్ కేసులు, నోటీసుల జారీ, విచారణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో గత రెండు నెలలుగా సర్ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. సర్ లో భాగంగా బూతు స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను అందించారని, 2002 నాటి సర్ ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టి ఫారాలను పూర్తి చేసినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, నిర్ణీత తేదీన విచారణకు హాజరై తమ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించాలని సూచించారు. సందేహాలు ఉంటే సంబంధిత బూతు స్థాయి అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో రాజకీయ పార్టీలకు కూడా కీలక పాత్ర ఉందని రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్ఏలు), బిఎల్ఓ లతో సమన్వయం చేసుకుని సర్ ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

**గణపురంలో మండలంలో 3,371 ఓట్లు తొలగింపు**

గణపురం మండలంలో డ్రాఫ్ట్ ప్రక్రియకు ముందు 33,493 మంది ఓటర్లు ఉండగా, సర్ ప్రక్రియలో 3,371 ఓట్లు తొలగించడంతో ప్రస్తుతం 30,122 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. మండలంలో ప్రస్తుతం 36 పోలింగ్ స్టేషన్లు ఉండగా, కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలను దృష్టిలో ఉంచుకుని అదనంగా 3 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరుకు తుది జాబితాలో చోటు కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. సర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, బిఎల్ఓ లు, బిఎల్ ఏలు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, తహసీల్దార్ రాజేశ్వర రావు, ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీకాంత్, సర్పంచ్ రాధిక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు పంచాయతీలో మరో మూడు అంతస్తుల భవనం

- 1/70 చట్టాన్ని తుంగలో తొక్కినట్లేనా? పంచాయతీ అధికారుల తీరుపై విమర్శలు
- ఆర్టీఐలో అనుమతులపై స్పష్టత.. మరి అధికారుల కళ్ల ముందే నిర్మాణం ఎలా?
- పంచాయతీ అధికారుల పాత్రపై అనుమానాలు..
- సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్.
- చట్టం కేవలం కాగితలకే పరిమితమా?



మణుగూరు ఆగష్టు 27 ( పీపుల్స్ డైరీ ) : మణుగూరు: 1/70 చట్టం అమల్లో ఉన్న ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా మూడు అంతస్తుల భవన నిర్మాణం జరుగుతున్న వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఈ నిర్మాణం గ్రామ పంచాయతీ పరిధిలోనే కొనసాగుతుండటం మరింత ప్రశ్నార్థకంగా మారింది. 1/70 చట్టం పరిధిలో నిర్మాణాలకు సంబంధించి అనుమతుల అంశంపై గ్రామ పంచాయతీ నుంచి ఆర్టీఐ ద్వారా సమాచారం కోరగా.. నిర్మాణ అనుమతులకు సంబంధించిన అంశాలపై స్పష్టమైన సమాధానం రావడం ఈ వ్యవహారంలో కీలకంగా మారింది.

ఒకవైపు అధికారిక రికార్డుల్లో 1/70 చట్ట పరిధిలో నిర్మాణాలకు అనుమతుల విషయంలో పరిమితులు, నిబంధనలు ఉన్నట్లు స్పష్టమవుతుంటే.. మరోవైపు అదే పరిధిలో మూడు అంతస్తుల భవనం నిర్మాణ పనులు కొనసాగుతుండటం అధికారుల పర్యవేక్షణపై తీవ్ర సందేహాలను రేకెత్తిస్తోంది.

**పంచాయతీ పరిధిలో ఇంత పెద్ద నిర్మాణం.. అధికారులకు కనిపించలేదా?**

మూడు అంతస్తుల భవనం నిర్మాణం అంటే ఒకటి రెండు రోజుల్లో పూర్తయ్యే పని కాదు. నిర్మాణానికి ముందు అనుమతులు, భవన ప్లాన్, స్థల పరిశీలన, సంబంధిత రికార్డులు వంటి అనేక అంశాలు ఉండాల్సిందే. మరి ఇంత భారీ నిర్మాణం గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతుంటే సంబంధిత పంచాయతీ అధికారులకు సమాచారం లేదా? తెలిసుంటే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనుమతులు ఉంటే ఎవరు మంజూరు చేశారు? అనుమతులు లేకుంటే నిర్మాణాన్ని ఎందుకు నిలిపివేయలేదు? నోటీసులు జారీ చేశారా? స్థల పరిశీలన నిర్వహించారా? నిర్మాణానికి సంబంధించిన పూర్తి ఫైలు ఎక్కడుంది? ఇవే ఇప్పుడు ప్రజల ముందున్న కీలక ప్రశ్నలు.

**ఆర్టీఐ సమాధానాలు బయట పెడుతున్న అసలు ప్రశ్న ఇదే!**

ఈ వ్యవహారంలో ఆర్టీఐ ద్వారా అధికారిక సమాచారాన్ని సేకరించడం వల్ల మరిన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారిక రికార్డుల్లో అనుమతుల విషయంలో ఒక పరిస్థితి ఉంటే.. క్షేత్రస్థాయిలో మాత్రం మూడు అంతస్తుల నిర్మాణం ఎలా కొనసాగుతోంది? చట్టం అమల్లో ఉన్న ప్రాంతంలో సామాన్యులు చిన్న నిర్మాణం చేపట్టినా నిబంధనలు, అనుమతులు అంటూ అధికారుల తనిఖీలు ఉంటాయి. అలాంటప్పుడు మూడు అంతస్తుల భారీ భవనం నిర్మాణం జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం వెనుక కారణమేంటి అన్నది తేలాల్సి ఉంది.

**అధికారుల అండదండలతోనే నిర్మాణం సాగుతోందా?**

అనుమతులు లేని నిర్మాణాన్ని అధికారులు చూసీ చూడనట్లు వదిలేశారా? లేక ఎవరి అండదండలతోనైనా నిర్మాణం కొనసాగుతోందా? అన్న అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ అనుమానాలు వాస్తవమా కాదా అన్నది అధికారిక విచారణలో తేలాల్సిందే. అందుకే పంచాయతీ అధికారులు ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలను బహిర్గతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**నిర్మాణానికి అనుమతి ఉంటే బయటపెట్టాలి.. లేకుంటే చర్యలు తీసుకోవాలి**

భవనానికి అన్ని చట్టబద్ధమైన అనుమతులు ఉన్నట్లయితే సంబంధిత అనుమతి పత్రాలు, బిల్డింగ్ ప్లాన్, సాంకేతిక అనుమతులు, స్థల పరిశీలన నివేదికలను అధికారులు స్పష్టం చేయాలి. అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే నిర్మాణదారుడిపై మాత్రమే కాకుండా, నిబంధనల ఉల్లంఘన తెలిసినా చర్యలు తీసుకోని అధికారుల బాధ్యతపైనా విచారణ జరగాలి. ముఖ్యంగా 1/70 చట్టం వర్తించే ప్రాంతంలో నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పంచాయతీ, ఇతర సంబంధిత శాఖల రికార్డులను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**ఉన్నతాధికారుల జోక్యం తప్పనిసరి**

గ్రామ పంచాయతీ పరిధిలో మూడు అంతస్తుల భవన నిర్మాణంపై జిల్లా స్థాయి అధికారులు వెంటనే దృష్టి సారించి స్థల పరిశీలనతో పాటు రికార్డుల సమగ్ర తనిఖీ నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. 1/70 చట్టం ఉన్న ప్రాంతంలో ఇంత భారీ నిర్మాణం.. పంచాయతీ పరిధిలోనే కొనసాగుతుంటే అధికారులకు తెలియదా? తెలిసి కూడా చర్యలు తీసుకోలేదా? తెలిస్తే ఎందుకు మౌనం? తెలియకపోతే పర్యవేక్షణ ఎక్కడ? అనుమతి ఉంటే ఆ పత్రాలు ఎక్కడ? అనుమతి లేకుంటే చర్యలు ఎందుకు లేవు? ఈ ప్రశ్నలకు గ్రామ పంచాయతీ అధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది.

చట్టం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలవుతుందా లేదా అన్నది ఈ మూడు అంతస్తుల భవన వ్యవహారంతో తేలాల్సి ఉంది. అధికారుల మౌనం కొనసాగితే అనుమానాలు మరింత బలపడే అవకాశం ఉంది. అందుకే ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎంజిఎం హైస్కూల్‌లో ముందస్తు రాఖీ వేడుకలు

- ఆప్యాయతను చాటుకున్న విద్యార్థులు
- ఉపాధ్యాయులకు రాఖీలు కట్టిన టీచర్లు
- రాఖీ విశిష్టతను వివరించిన కరెస్పాండెంట్ సతీష్






**గణపురం, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని చెల్పూర్ గ్రామంలోని ఎంజీఎం హైస్కూల్‌లో రాఖీ పండుగ వేడుకలను గురువారం ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసంలో పౌర్ణమి రోజున జరుపుకొనే రాఖీ పండుగను పురస్కరించుకుని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయతను పెంపొందించేలా ఒకరికొకరు రాఖీలు కట్టుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ గ్యాదంగి సతీష్ మాట్లాడుతూ... రాఖీ అంటే రక్షణకు ప్రతీక అని అన్నారు. సోదరులు, సోదరీమణుల మధ్య ఉన్న ప్రేమానురాగాలు, ఆత్మీయ అనుబంధాన్ని తెలియజేసే పండుగగా రాఖీ పౌర్ణమిని జరుపుకుంటారని తెలిపారు. రాఖీ పండుగకు సంబంధించి పురాణాల్లో అనేక కథలు ప్రచారంలో ఉన్నప్పటికీ, నేటికీ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, పరస్పర ప్రేమకు ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటున్నారని పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయినులు పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు సహచర ఉపాధ్యాయులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుల నుంచి చిరు కానుకలు స్వీకరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పరస్పరం రాఖీలు కట్టుకోవడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. రాఖీ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించడంతో పాటు సోదర సోదరీమణుల మధ్య ఉండే ప్రేమ, ఆప్యాయత, పరస్పర రక్షణ భావనలను విద్యార్థుల్లో పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు గ్యాదంగి తిరుపతి, గ్యాదంగి రమాదేవి, సిల్వేరి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మధూకర్, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువకుల మధ్య ఘర్షణ.. ఒకరి మృతి

**స్టోర్ గ్రౌండ్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షణ..**

**30-40 మంది యువకులు ఉన్నట్లు సమాచారం**







మణుగూరు ఆగష్టు 27 (పీపుల్స్ డైరీ) : మణుగూరు స్టోర్ గ్రౌండ్‌లో గురువారం యువకుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ తీవ్ర విషాదానికి దారితీసింది. ఈ ఘటనలో సింహాద్రి శివ (28) మృతి చెందినట్లు సమాచారం. యువకుల మధ్య జరిగిన ఘర్షణలో శివ తీవ్రంగా గాయపడటంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఘటనతో మణుగూరు పట్టణంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ప్రాథమిక సమాచారం మేరకు.. శివ వద్ద పనిచేసే ఓ వర్కర్‌కు కొందరు వ్యక్తులతో వివాదం ఏర్పడినట్లు తెలుస్తోంది. ఈ వివాదం నేపథ్యంలో శివను స్టోర్ గ్రౌండ్‌కు పిలిపించినట్లు సమాచారం. అక్కడ రెండు వర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో శివపై పలువురు దాడికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

ఘటన జరిగిన సమయంలో స్టోర్ గ్రౌండ్‌లో సుమారు 30 నుంచి 40 మంది యువకులు ఉన్నట్లు సమాచారం. ఘర్షణలో ఎవరి పాత్ర ఎంతవరకు ఉంది? శివపై నేరుగా దాడి చేసింది ఎవరు? ఘర్షణకు అసలు కారణం ఏమిటి? అనే అంశాలు ఇప్పుడు పోలీసుల దర్యాప్తులో కీలకంగా మారాయి. శివపై దాడికి పాల్పడిన వారిని కుటుంబ సభ్యులు లి'ఎంకే గ్యాంగ్'లిగా పేర్కొంటూ ఆరోపణలు చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి పోలీసుల నుంచి అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది. దాడిలో పాల్గొన్న వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు ఘటనాస్థలంలో వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఘర్షణకు ముందు, తరువాత జరిగిన పరిణామాలు, అక్కడ ఉన్న వ్యక్తుల వివరాలు, అందుబాటులో ఉన్న సీసీ కెమెరా దృశ్యాలు వంటి అంశాలు దర్యాప్తులో కీలకంగా మారే అవకాశం ఉంది. ఘటన వెనుక వ్యక్తిగత వివాదమా.. పాత కక్షలా.. లేక మరేదైనా కారణమా అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. శివ మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. తమ కుటుంబ సభ్యుడి మృతికి కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, అసలు నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఘటనపై సీఐ నాగబాబు, ఎస్ఐ నగేష్ ఆధ్వర్యంలో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ఘర్షణకు సంబంధించిన పూర్తి వివరాలు, మృతికి దారితీసిన పరిస్థితులు పోలీసుల దర్యాప్తు అనంతరం స్పష్టమయ్యే అవకాశం ఉంది.

## రీసర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**మట్టెవాడ, ఆగస్టు 27 (పీపుల్స్ డైరీ):** ఖిలా వరంగల్ మండలం అలీపురం గ్రామంలో కొనసాగుతున్న రీసర్వే పనులను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వే ప్రక్రియలో భాగంగా చేపడుతున్న భూముల సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో సర్వే పనుల పురోగతిని పరిశీలించి, రికార్డులు, క్షేత్రస్థాయి వివరాలను సమగ్రంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. రీసర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ రీసర్వే పరిశీలనలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద వెంట ఏడి సర్వే అధికారి శ్రీనివాసులు, ఖిలావరంగల్ తహసిల్దార్ ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.


EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.

**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com